



# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States


## జూన్ 24 నుంచి అసెంబ్లీ సమావేశాలు..




**అమరావతి, జూన్ 17 (వార్తాప్రభ) :** జూన్ 22న ఏపీ కేబినెట్ మీటింగ్, అలాగే 24 నుంచి 5 రోజుల పాటు అసెంబ్లీ సమావేశాలు జరుగనున్నట్లు సమాచారం. నిజానికి జూన్ 18 కేబినెట్ సమావేశం, 19 నుంచి అసెంబ్లీ సమావేశాలు నిర్వహించాలని ప్రభుత్వం అనుకుంది. అయితే, కొందరు మంత్రులు ఛార్జ్ తీసుకోక పోవడంతో వాయిదా వేయనున్నట్లు తెలుస్తోంది..

సంపుటి : 23 | సంచిక : 96 | ది.18-6-2024 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ.1/-

# పోలవరాన్ని సర్వనాశనం చేసిన జగన్

● ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది ● అసమర్థ, అహంకార నిర్ణయాలతో పోలవరాన్ని సర్వనాశనం చేశారు ● 2019 నాటికి 72 శాతం పూర్తిచేశాం... నేడు అంతా అగమ్యగోచరం ● డయాఫ్రం వాల్, కాఫర్ డ్యాంలకు జరిగిన నష్టం సరిదిద్దాలంటే కనీసం 4ఏళ్లు పడుతుందంటున్నారు ● ప్రాజెక్టు నిర్మాణంలో గత ప్రభుత్వం చేయని తప్పులేదు...జరగని నష్టం లేదు ఈ ఘోర తప్పిదానికి ఎవరు బాధ్యత వహిస్తారో కూడా తేలాలి ● సిఎం హెూదాలో పోలవరం ప్రాజెక్టు వద్ద చంద్రబాబు నాయుడు తొలి పర్యటన ● క్షేత్రస్థాయిలో పనులను పరిశీలించిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ● రెండు గంటల పాటు ప్రాజెక్టు సైట్ లో పర్యటన... ఇరిగేషన్ అధికారులతో సమీక్ష










**పోలవరం,జూన్ 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ కు జీవనాడి అయిన పోలవరం ప్రాజెక్టును మా జీ సీఎం జగన్ మూర్ఖత్వం, అహంకారంతో సర్వనాశనం చేశారని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆగ్రహం వ్యక్తంచేశారు. పోలవరం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితిని చూస్తే బాధేస్తోందని, ప్రాజెక్టుకు జరిగిన నష్టం చూస్తే జగన్ రాజకీయాల్లో ఉండకూడని వ్యక్తి అని అర్థమవుతో ందన్నారు. నాటి ప్రభుత్వం విధ్వంసానికి పోలవరం ఒక కేస్ స్టడీ లాంటిదని అన్నారు. పోలవరం విషయంలో జగన్ క్షమించరాని తప్పు చేశారని చెప్పారు. ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టాక ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తొలిసారి పోలవరం ప్రాజెక్టును సోమవారం పరిశీలించారు. ఉదయం 11.40కి ప్రాజెక్టు సమీపాన ఉన్న హెలిప్యాడ్ వద్దకు చంద్రబాబు చేరుకున్నారు. మంత్రులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, జిల్లా అధికారులు, ఎమ్మెల్యేలు, నేతలు ఆయనకు ఘనస్వాగతం పలికారు. వ్యూ పాయింట్ వద్ద నుండి ప్రాజెక్టును పరిశీలించారు. అనంతరం క్షేత్రస్థాయిలో కలియదిరిగి ప్రాజెక్టు వద్ద పరిస్థితిని సందర్శించారు. స్పిల్ వే, కాఫర్ డ్యాం, డయా ఫ్రం వాల్ తో పాటు 22, 23 గేట్ల దగ్గర నుండి ప్రాజెక్టను పరిశీలించారు. ఎడమగట్టు దగ్గర కుంగిన గైడ్ బండ్ ప్రాంతానికి వెళ్లారు. గ్యాప్-3 ప్రాంతం, ఎగువ కాఫర్ డ్యాం ప్రాంతాన్ని పరిశీలించారు. మొత్తం ప్రాజెక్టు నిశితంగా పరిశీలించిన సీఎం... అధికారులను పలు ప్రశ్నలు అడిగి వివరాలు తెలుసుకున్నారు. డయా ఫ్రం వాల్ దెబ్బతిన్న ప్రాంతాన్ని సందర్శించారు. అధికారులతో సమీక్ష నిర్వహించాక చంద్రబాబు విలేకరులతో మాట్లాడుతూ. అయిదేళ్ల తన కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరు చేశారంటూ తీవ్ర ఆవేదన వ్యక్తంచేశారు.

### టీడీపీ హయాంలో 72 శాతం ప్రాజెక్టు పనులు పూర్తి

"పోలవరం పూర్తి చేసి నదులు అనుసంధానం చేసుకోగలిగితే రాష్ట్రానికి కరవు అనేది లేకుండా చేయొచ్చని భావించాం. 2014 ఎన్నికల్లో ఏపీలో టీడీపీ-బీజేపీ, కేంద్రంలో ఎన్డీయే ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ప్రాజెక్టు కింద ముంపునకు గురయ్యే 7 మండలాలు తెలంగాణలో ఉంటే...అవి ఏపీలో కలిపితేనే ప్రమాణస్వీకారం చేస్తానని కేంద్రంతో చెప్పాను. దీంతో మొదటి కేబినెట్ సమావేశంలోనే 7 మండలాలు ఏపీలో కలిపేలా నిర్ణయం తీసుకున్నారు. అనేక దశాబ్దాల కసరత్తు తర్వాత 45.72 మీటర్ల ఎత్తుతో 194 టీఎంసీలు నీటిని నిల్వ ఉంచేలా ప్రాజెక్టుకు డిజైన్ చేశాం. 194 టీఎంసీల నీళ్లు ప్రాజెక్టులో నిల్వ ఉంచుకుంటే వరద నీటితో కలిపి 320 టీఎంసీల నీటిని వాడుకోవడానికి వీలవుతుంది. తద్వారా ఉత్తరాంధ్ర, ఉభయ గోదావరి జిల్లాలు, కృష్ణా, గుంటూరు జిల్లాలతోపాటు రాయలసీమకు కూడా ఈ నీటిని ఇవ్వొచ్చు. ప్రాజెక్టులో నిల్వ చేసిన నీటిలో 99 శాతం వాడుకునే అవకాశం ఉంది. 2014-19 మధ్య 72 శాతం మేర పనులను పూర్తి చేశాం." అని సీఎం చంద్రబాబు అన్నారు.

### సమాంతరంగా డయాఫ్రం వాల్ నిర్మాణానికి రూ.990 కోట్లు కావాలి

"గతంలో నేను సిఎంగా ఉన్నపుడు 30 సార్లు ప్రాజెక్టును సందర్శించా...ఇప్పుడు మళ్లీ 31వ సారి వచ్చాను. నా మనసంతా ప్రాజెక్టుపైనే ఉండేది...కానీ ప్రాజెక్టు కోసం నేను పడ్డ కష్టాన్ని బూడిదలో పోసిన పన్నీరుగా చేశారు. భూ సేకరణలో కూడా బాధితులను ఒప్పించి ముందుకు వెళ్లాం. కానీ వైసీపీ ప్రభుత్వం రాగానే రివర్స్ టెండర్ అంటూ ఏజన్సీని మార్చారు, అధికారులను మార్చారు. గత పాలకుల నిర్లక్ష్యంతో 2 సార్లు వచ్చిన వరదలతో డయాఫ్రం వాల్ 4 చోట్ల దెబ్బతింది..ప్రభుత్వం దీన్ని కాపాడలేపోయింది. డయా ఫ్రం వాల్ 35 శాతం దెబ్బతింది. కానీ గత ప్రభుత్వం కాపాడకుండా ప్రాజెక్టుతో ఆడుకోవడం వల్ల తీవ్రమైన నష్టం జరిగింది. డయాఫ్రం వాల్ పై గతంలో మేం ఖర్చు చేసింది రూ.446 కోట్లు అయితే...జగన్ నిర్వాకం వల్ల ప్రస్తుతం రిపేర్లు చేయడానికి రూ.447 కోట్లు అవుతుంది...అయినా పూర్తిస్థాయిలో బాగవుతుందనే నమ్మకం లేదని అధికారులు చెప్తున్నారు. రెండో ప్రణాళిక ప్రకారం సమాంతరంగా కొత్త డయాఫ్రం వాల్ కట్టాలంటే రూ.990 కోట్లు ఖర్చు అవుతుంది. ఎగువ కాఫర్ డ్యాం, దిగువ కాఫర్ డ్యామ్ ను రూ.550 కోట్లతో నిర్మాణం జరిగింది. అయితే గత ప్రభుత్వం నిర్వాకంతో చివర్లో ఉన్న గ్యాప్ పూర్తి చేయకపోవడంతో తీవ్ర నష్టం జరిగింది, గైడ్ బండ్ కూడా కుంగిపోయింది. ఇవన్నీ చక్కదిద్దాలంటే ఎన్ని వేల కోట్లు కావాలో ఇప్పటికీ అధికారుల వద్ద నిర్ధిష్టమైన లెక్కలు లేవు. 2019 నుండి ఏజన్సీలను మార్చకుండా పనులు కొనసాగి ఉంటే 2020 చివరి నాటికి ప్రాజెక్టు పూర్తయ్యేది. కానీ ఇప్పుడు ఈ రిపేరు పనులకే నాలుగు సీజన్లు పడుతుందని అధికారులు చెప్తున్నారు. అది కూడా అనుకున్న ప్రకారం అన్నీ సవ్యంగా జరిగితేనే" అని చంద్రబాబు అన్నారు.

### ప్రాజెక్టుకు జగన్ చిక్కుముళ్లు వేశారు

"ఒక వ్యక్తి రాష్ట్రానికి శాపంగా మారతాడని చెప్పడానికి పోలవరం ఒక కేస్ స్టడీ. రాష్ట్రంలో ప్రతి ఒక్కరూ దీనిపై చర్చించాలి...జరిగిన నష్టం ప్రతి ఒక్కరికీ తెలియాలి...ఏ ఒక్కటీ దాచిపెట్టకూడదు. కాఫర్ డ్యాం ద్వారా నీళ్లు లీకేజీ కంట్రోల్ అవ్వకపోతే డయాఫ్రం వాల్ పనులు చేయడం కుదరదు. లీకేజీ ద్వారా వచ్చిన నీళ్లు ఎత్తిపోయాలంటే భారీగా ఖర్చు అవుతంది. జగన్ చేతకాని తనంతో ప్రాజెక్టుకు చిక్కు ముళ్లు వేశారు. 2014-19 వరకు సగటున యేటా రూ.13,683 కోట్లను మా ప్రభుత్వం ఇరిగేషన్ మీద ఖర్చు చేసింది.. బడ్జెట్ పెరిగిప్పుడు కేటాయింపులు పెరగాలి... కానీ వైసీపీ ప్రభుత్వంలో అలా జరగలేదు. ఆంధ్రుల జీవనాడి పోలవరాన్ని పూర్తి చేయాలి...ఇది ప్రతి ఒక్కరికీ సంబంధించిన ప్రాజెక్టు. ప్రాజెక్టు పరిస్థితి చూస్తే బాధ, ఆవేదన కలుగుతోంది. అయినా నిబ్బరంగా ఉండి ముందుకు తీసుకెళ్తాం. 2019లో వచ్చిన ప్రభుత్వం ఏజన్సీని మార్చకపోతే నెలలోనే కాఫర్ డ్యాం పూర్తయ్యేది...కానీ వెంటనే ఏజన్సీని మార్చారు. ఏజన్సీని మార్చొద్దని పీపీఏ, కేంద్రం కూడా లేఖ రాశాయి.." అని ముఖ్యమంత్రి అన్నారు.

**ప్రాజెక్టు పరిస్థితిపై లోతుగా అధ్యయనం చేస్తున్నా!..** "నేను ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు సందర్శనకు వస్తే అడ్డుకున్నారు. గతంలో మేము అధికారంలో ఉన్నప్పుడు ప్రాజెక్టు పనులు జరుగుతున్న తీరును ప్రజలకు చూపించాం. ఇది ప్రజల ప్రాజెక్టు. ఈ సీజన్ అయి పోయింది...డిసెంబర్ వరకూ ఏ పనీ చేయడానికి కుదరదు. ప్రాజెక్టుపై లోతుగా అధ్యయనం చేస్తున్నా. డయాఫ్రం వాల్ కనబడలేదని చెప్పిన మంత్రులను కూడా చూశాం.

# రిలీవ్ అవ్వద్దు

● ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణకు సిఎస్ ఆదేశం



**విజయవాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** ఆంధ్రప్రదేశ్ ఆర్థిక శాఖ కార్యదర్శి సత్యనారాయణకు రాష్ట్ర ప్రభుత్వం ఝలక్ ఇచ్చింది. బాధ్యతల నుంచి రిలీవ్ కావొద్దని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఆయనకు ఆదేశాలు జారీ చేశారు. రాష్ట్రంలో ఎన్డీయే ప్రభుత్వం ఏర్పడడంతో మూడ్రోజుల కిందట సత్యనారాయణ నేరుగా వెళ్లి నార్త్ ఈస్ట్రన్ రైల్వేలో జాయిన్ అయ్యారు. రైల్వే ఉన్నతాధికారులు సైతం ఆయనకు వెంటనే పోస్టింగ్ ఇచ్చారు. జాయినింగ్ రిపోర్ట్ ఇవ్వాలంటే సత్యనారాయణకు రిలీవింగ్ ఆర్డర్ కావాలి. ఈలోపే విషయం తెలుసుకున్న సీఎస్ నీరబ్ కుమార్ రిలీవ్ కావొద్దంటూ ఆదేశించారు. గత వైసీపీ ప్రభుత్వంతో అంటకాగారనే తీవ్ర ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. అందులోనూ ఆర్థిక శాఖ స్పెషల్ చీఫ్ సెక్రటరీ రావత్ సిక్ లీవ్‌లో ఉండటంతో ఈనెల 18న రిలీవ్ కావాల్సిన అవసరం లేదంటూ సీఎస్ స్పష్టం చేశారు. దీంతో సత్యనారాయణ ఎస్కేప్ ప్రయత్నాలకు చెక్ పడినట్లయ్యింది. 2017లో రైల్వే నుంచి వచ్చి ఏపీ ఆర్థిక శాఖలో సెక్రెటరీగా ఐఆర్ఎస్ అధికారి సత్యనారాయణ జాయిన్ అయ్యారు. అప్పటి నుంచి ఆ శాఖలో ఆయన అరాచకం సృష్టించారు. అనేక అవకతవకలకు ఆయనే కారణమని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. గత ప్రభుత్వంలో కేవలం వైసీపీ నేతల అనుచరులుగా ఉన్న కాంట్రాక్టర్లకు మాత్రమే బిల్లులు చెల్లించి మిగతా వారిని పక్కన పెట్టారనే తీవ్ర ఆరోపణలు ఆయనపై ఉన్నాయి. ఈ నేపథ్యంలో బిల్లుల కోసం హైకోర్టులో వేల సంఖ్యలో కేసులు, కోర్టు ధిక్కార కేసులు నమోదయ్యాయి. భవిష్యత్ ఆదాయాన్ని సైతం తాకట్టుపెట్టి అప్పు తెచ్చిన ఘనత ఆయనకే దక్కుతుంది. తాడేపల్లి ప్యాలెస్ నుంచి ఫోన్ వస్తే చాలు ఎవరికి బిల్లులు చెల్లించమంటే వారికి చెల్లించారు. ఎన్డీయే ప్రభుత్వం రాగానే భయంతో ఆయన రిలీవ్ అయ్యేందుకు ప్రయత్నాలు చేశారు. దీంతో విషయం తెలుసుకున్న సీఎస్ ఆయనకు చెక్ పెట్టారు.

# వైసీపీకి ఇక లేదు - జనసేనకే ఆ కీలక పదవి..!!



**విజయవాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** ఏపీలో రాజకీయం మరోసారి ఆసక్తి కరంగా మారుతోంది. ఎన్నికల్లో ఏకపక్ష విజయం సాధించిన కూటమి పాలన ప్రారంభించింది. కొత్తగా ఎన్నికలైన సభ్యులతో అసెంబ్లీ కొలువు తీరేందుకు సిద్దమైంది. అటు అసెంబ్లీ స్పీకర్ గా టీడీపీ సీనియర్ అయ్యన్న పాత్రుడు పేరు ఖరారైంది. డిప్యూటీ స్పీకర్ పదవి జనసేనకు ఇవ్వాలని నిర్ణయించారు. ఇక..ప్రతిపక్ష పార్టీకి దక్కే కీలక పదవి వైసీపీకి కాదని..జనసేనకు ఇచ్చేలా నిర్ణయం దాదాపు ఖరారైనట్లు తెలుస్తోంది. జనసేనకు ప్రాధాన్యత ఏపీలో కొత్త ప్రభుత్వంలో జనసేన భాగస్వామి అయింది. జనసేనాని పవన్ డిప్యూటీ సీఎంగా..మరో ఇద్దరు మంత్రులుగా ప్రమాణ స్వీకారం చేసారు. వారికి శాఖలు ఖరారయ్యాయి. ఇక..స్పీకర్ గా టీడీపీ నుంచి సీనియర్ నేత అయ్యన్న పేరు ఖాయమైంది. డిప్యూటీ సీఎం పదవి మిత్రపక్షం జనసేనకు ఇవ్వాలని చంద్రబాబు నిర్ణయించారు. అందులో భాగంగా లోకం మాధవి, పంతం నానాజీ పేర్లు పరిశీలనలో ఉన్నాయి. స్పీకర్ పదవి ఉత్తరాంధ్ర కు చెందిన అయ్యన్నకు ఇస్తుండటంతో..అదే ప్రాంతానికి చెందిన మాధవికి డిప్యూటీ ఇస్తారా అనేది తేలాల్సి ఉంది. వైసీపీకి ప్రతిపక్ష హెూదా దక్కేనా సామాజిక వర్గం పరంగా మాధవికి ఛాన్స్ ఉంది. అయితే, ప్రాంతీయ కోణంలో పంతం నానాజీకి అవకాశం కనిపిస్తోంది. దీని పైన పవన్ తుది నిర్ణయం తీసుకోవాల్సి ఉంది. ఇక.. వైసీపీకి ప్రతిపక్ష హెూదాకు కావాల్సిన 18 స్థానాలు రాకపోవటంతో ప్రతిపక్ష పాత్ర ఎవరిదనే చర్చ జరుగుతోంది. మూడు పార్టీల కూటమికి 164 సీట్లు రావటంతో...సాంకేతికంగా సీట్లు లేకపోయినా వైసీపీ ప్రతిపక్షంగా వ్యవహరిస్తుందనే వాదన ఉంది. అయితే, అసెంబ్లీలో వైసీపీకి ప్రతిపక్ష హెూదా కాకుండా సాధారణ ఎమ్మెల్యేల హెూదాలోనే సీట్ల కేటాయింపు జరుగుతందని టీడీపీ నేతల సమాచారం. జనసేనకు పీఏసీ ఛైర్మన్ పదవి ఇక, సహజంగా ప్రతిపక్ష పార్టీకి పీఏసీ (పబ్లిక్ అకౌంట్స్ ఛైర్మన్) పదవి దక్కుతుంది. 2014-2019 టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో వైసీపీ నుంచి తొలుత భూమా నాగిరెడ్డి ఆ తరువాత బుగ్గన ఈ పదవి నిర్వహించారు. వైసీపీ అధికారంలో ఉన్న సమయంలో టీడీపీ నుంచి పయ్యావుల కేశవ్ కొనసాగారు. ఇప్పుడు ఈ పదవి జనసేనకు ఇవ్వాలని నిర్ణయించినట్లు సమాచారం. జనసేన నుంచి గతంలో కాంగ్రెస్ లో మంత్రిగా పని చేసిన కొణతాల రామక్రిష్ణ పేరు పరిశీలనలో ఉందని తెలుస్తోంది. పీఏసీ ఛైర్మన్ పదవి పైన అధికారికంగా నిర్ణయం వెల్లడించే అవకాశం కనిపిస్తోంది.

# చంద్రబాబు కేబినెట్‌లో దక్కని చోటు..

## పగలు సెగలు రేగే పల్నాడుకు రాజకీయ ప్రాధాన్యత తగ్గిందా..?

● పగలు సెగలు రేగే పల్నాడుకు రాజకీయ ప్రాధాన్యత తగ్గిందా..?

● చంద్రబాబు నాయుడు మంత్రి మండలిలో చోటు దక్కకపోవడం ఏం సూచిస్తోంది..?

● గత ప్రభుత్వంలోలాగే రెండున్నరేళ్ల పాటు పల్నాడును పక్కన పెట్టేశారా..?




**గుంటూరు, జూన్ 17 (వార్తాప్రభ) :** ఎన్నికల సమయంలోనూ ఆ తర్వాత కూడా దేశ వ్యాప్తంగా వార్తల్లో నిలిచిన పల్నాడు ప్రస్తుతం తన పొలిటికల్ పవర్ కోల్పోయిందన్న ప్రచారం జరుగుతోంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో పల్నాడుది ప్రత్యేక స్థానం. చారిత్రక నేపథ్యం కలిగిన పల్నాడు అభివృద్ధిలో వెనుక పడినా రాజకీయ ప్రాధాన్యతలో మాత్రం ముందంజలో ఉండేది. ఈ ప్రాంతానికి చెందిన ఇద్దరూ నేతలు కాసు బ్రహ్మానంద రెడ్డి, భవనం వెంకట్రామ్ ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రులుగా కూడా పనిచేశారు. వీరిద్దరూ కాంగ్రెస్ పార్టీకి చెందిన నేతలు కాగా తెలుగుదేశం పార్టీ ఆవిర్భావం తర్వాత కోడెల శివ ప్రసాద్ ముఖ్య నేతగా ఎదిగారు. కోడెలకు పోటీగా కాసు క్రిష్ణారెడ్డి కాంగ్రెస్ రాజకీయాల్లో చక్రం తిప్పారు. ఏ పార్టీ ప్రభుత్వం ఏర్పాటు చేసిన వీరిద్దరిలో ఎవరో ఒకరు మంత్రి మండలిలో ఉండేవారు. వైఎస్ రాజశేఖర్ రెడ్డి 2004, 2009 లో ప్రభుత్వాలను ఏర్పాటు చేసిన సమయంలో కాసుకు మంత్రి పదవి దక్కింది. ఇక 2014లో రాష్ట్ర విభజన తర్వాత కోడెల ఏకంగా శాసన సభ స్పీకరే అయ్యారు. కోడెలతో పాటు పల్నాడు ప్రాంతానికే చెందిన ప్రత్తిపాటి పుల్లారావుకు మంత్రి పదవి దక్కింది. అప్పటి వరకూ పల్నాడు నేతల హవా కొనసాగింది. 2019లో తొలిసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసిన వైఎస్ జగన్ పల్నాడు నేతలను పక్కనే పెట్టేశారు. తనకు నమ్మినబంటు పిన్నెల్లి కూడా మంత్రి మండలిలో చోటు ఇవ్వలేదు. ఇక అంబటి పరిస్థితి కూడా ఇదే విధంగా ఉంది. పల్నాడులోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో విజయం సాధించిన మంత్రి మండలిలో మాత్రం జగన్ అవకాశం కల్పించకపోవడంతో నేతలు అసంతృప్తికి లోనయ్యారూ అయితే రెండోసారి చేసిన మంత్రి వర్గ విస్తరణలో పల్నాడు జిల్లాకు చెందిన ఇద్దరూ నేతలు కేబినెట్‌లో చోటు దక్కించుకోవడంతో పల్నాడు ప్రాంతం తిరిగి ప్రాధాన్యతను సంతరించుకుంది. అంబటి రాంబాబు జలవనరుల శాఖ మంత్రి కాగా, విడదల రజిని వైద్య ఆరోగ్య శాఖ మంత్రి అయ్యారు. అయితే గత నెలలో జరిగిన ఎన్నిల్లో పల్నాడు జిల్లాలోని ఏడు అసెంబ్లీ స్థానాల్లో వైసిపి అభ్యర్థులు ఓడిపోయారు. మరోవైపు రాష్ట్ర రాజకీయాల్లోనే అనుభవం ఉన్న నాయకులు కన్నా లక్ష్మీనారాయణ, ప్రత్తిపాటి పుల్లారావు, యరపతినేని, జీవిఎస్ ఆంజినేయులు వంటి నేతలు గెలుపొందారు. దీంతో వీరిలో ఎవరో ఒకరికి కచ్చితంగా మంత్రి పదవి వస్తుందని ఆశించారు. అయితే వీరందరిని చంద్రబాబు నాయుడు పక్కన పెట్టారు. దీంతో గత ప్రభుత్వంలోలానే పల్నాడు తన ప్రాంత ప్రాముఖ్యతను కోల్పోయినట్లు స్థానికులు భావిస్తున్నారు. ఎన్నికల సమయంలో చెలరేగిన హింసతో దేశ వ్యాప్తంగా పల్నాడు పేరు మారుమ్రోగింది. అయితే ఎన్నికల సంఘం, పోలీసులు కఠిన చర్యలు తీసుకొని పరిస్థితులు చక్కదిద్దారు. వర్గ రాజకీయాలకు పేరుగాంచిన పల్నాడులో ప్రధాన పార్టీలు ముఖ్య నేతలను పక్కన పెట్టడం నేతలకు ఇబ్బందికరంగానే మారింది. అయి తే నేతలు వచ్చే రెండేళ్ల తర్వాతైన తమ ప్రాంతానికి తమకు సరైన గుర్తింపు లభిస్తుందన్న ఆశతో ఉన్నారు..

# ఫస్ట్-ఫస్ట్టే.. ఫైనాన్షియల్ ఛాలెంజ్!



**విజయవాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** ఏపీలో కొత్త ముఖ్యమంత్రిగా టీడీపీ అధినేత, కూటమి పార్టీల ఉమ్మడి సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేశారు. ఇదొక అద్భుత ఘట్టం. సుమారు నాలుగు సంవత్సరాల కష్టానికి ప్రజలు ఇచ్చిన తీర్పు ఇది. అయితే.. ఆవెంటనే చంద్రబాబు సర్కారుకు ప్రధాన సవాల్ వచ్చింది. జూలై 1న ఆర్థిక రూపంలో ఇది ముందుకు వచ్చింది. ఇది అంత తేలిక విషయం కాదు. ఏదో మాట మాత్రం చెప్పే సవాల్ కూడా కాదు. అత్యంత కీలకమైన సవాల్. పైగా చంద్రబాబు ఇచ్చిన కీలక హామీకి సంబంధించిన సవాల్. ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు పదే పదే చెప్పిన హామీ.. ఇప్పటి వరకు ఇస్తున్న సామాజిక పింఛన్‌ను రూ.4000లకు పెంచుతామని. అంతేకాదు.. రాష్ట్రంలో ఏప్రిల్ మాసం నుంచి కూడా రూ.1000 చొప్పున పెంచి ఇస్తామని కూడా చంద్రబాబు తెలిపారు. ఆయనే వీటిని లెక్కగట్టి.. ఒక్కొక్కరికీ రూ.3000 చొప్పున అదనంగా కలిపి ఇస్తామన్నారు. అంటే ఒక్కొక్కరికీ రూ.7000 చొప్పున ఇవ్వాల్సి ఉంటుంది. ఇక్కడే మరోహామీ కూడా.. చంద్రబాబు ఇచ్చారు. లబ్ధిదారుల సంఖ్యను తగ్గించబోమన్నారు. అంటే.. ప్రస్తుతం సామాజిక పింఛన్లు తీసుకుంటున్న 64.5 లక్షల మందిలో ఎవరినీ తగ్గించడానికి వీల్లేదు. తగ్గిస్తే.. ఇదొక గగ్గోలు ఖాయం. దీంతో ఇంత మందికి రూ.7000 చొప్పున పింఛన్లను కేవలం 18 రోజుల్లో ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం రాష్ట్రానికి అప్పుగా రానున్న రూ.2000 కోట్లను చూసుకుంటే.. ఏమాత్రం దీనికి సరిపోదు. ఎందుకంటే.. ప్రతి నెలా వైసీపీ ప్రభుత్వం రూ.2వేల కోట్లకుపైగానే.. పింఛన్లకు ఖర్చు చేస్తోంది. ఇప్పుడు తొలినెలలో ఇవి రెట్టింపు అవుతున్నాయి. అంటే.. ఎంత లేదన్నా.. చంద్రబాబు సర్కారుకు రూ.10 నుంచి 12 వేల కోట్ల రూపాయలు కావాల్సి ఉంటుంది. ఇంత మొత్తం కేంద్రం నుంచి ఎలా తీసుకువస్తారు? అనేది ప్రశ్న. ఎందుకంటే.. కేంద్రంలో కూటమిగా ఉన్న టీడీపీ ఉంది కనుక.. వడ్డించేవాడు మనవాడే కనుక సాధ్యమనే వాదన ఉన్నా.. ఏమేరకు సాధ్యమనేది ప్రధాన ప్రశ్న. కేంద్రం నుంచి ఏపీకి ఏమేరకు సాయం చేసేందుకు కేంద్రం ముందుకు వచ్చినా.. కూటమి పార్టీలు కూడా పట్టుబట్టే అవకాశం కనిపిస్తోంది. ఈ నేపథ్యంలో చంద్రబాబు ఒకవేళ 5000 కోట్ల రూపాయలు ఇవ్వాలని కోరినా.. ఆ మేరకు మోడీ సాయం చేస్తారా? అనేది చూడాలి. ఇక, ఏపీలో ఉన్న సొమ్ము ఏమైనా రూ.5000 కోట్ల మేరకు జమ అవుతుందా? అది కూడా కష్టమే. ఎలా చూసుకున్నా.. జూలై 1 నాటికి రూ.10 నుంచి 12 వేల కోట్లను కూడగట్టి పింఛన్ల రూపంలో ఇవ్వడం.. బాబుకు ఫస్ట్ సవాల్‌గా మారింది. ప్రస్తుతం ఈ విషయంపైనే ఆర్థిక శాఖ అధికారులతో చంద్రబాబు రెండో రోజే భేటీ అయ్యారు. నిధుల సమీకరణపై ఆయన మంతనాలు చేశారు.

# దమ్ముంటే ఈవీఎంలను హ్యాక్ చెయ్.. ఎలాన్ మస్క్ కు బీజేపీ ఎంపీ పురందేశ్వరి ఛాలెంజ్!!

**విజయవాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** అమెరికా అధ్యక్ష ఎన్నికలలో ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్ల వినియోగంపైన బిలియనీర్, ప్రముఖ వ్యాపారవేత్త, టెస్లా అధినేత ఎలాన్ మస్క్ సంచలన వ్యాఖ్యలు చేశారు. సోషల్ మీడియా వేదికగా పోస్ట్ పెట్టిన ఎలాన్ మస్క్ ఎన్నికల ప్రక్రియలో ఈవీఎంలను తొలగించడంతో హ్యాకింగ్ ను నివారించవచ్చు అంటూ పేర్కొన్నారు. అమెరికాలోని ప్యూర్టో రికోలో ఇటీవల నిర్వహించిన ప్రైమరీ ఎన్నికల్లో అవకతవకలు చోటు చేసుకున్నాయి అన్న ఆరోపణలపై ఎక్స్ వేదికగా మస్క్ స్పందించారు. మస్క్ వ్యాఖ్యల దుమారం... ఈవీఎంల వార్ ఈవీఎంలను వ్యక్తులు లేదా ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ సహాయంతో హ్యాక్ చేసే ప్రమాదం ఉందని, ఇది దేశానికి నష్టాన్ని కలిగిస్తుందని మస్క్ అభిప్రాయపడ్డారు .ఇక దీంతో మస్క్ చేసిన వ్యాఖ్యలపైన భారతదేశంలో దుమారం రేగింది. ఎలాన్ మస్క్ చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో పెద్ద యుద్ధమే మొదలైంది. మస్క్ చేసిన వ్యాఖ్యల పైన బిజెపి కాంగ్రెస్ నేతలు తమదైన శైలిలో స్పందిస్తున్నారు.

## వార్తాప్రభ - పంచాంగం

**మంగళవారము 18-6-2024**

1946 క్రోధి
శ్రీ క్రోధి నామ సంవత్సరం
ఉత్తరాయణం
జ్యేష్ఠ మాసం
శుక్ల పక్షము, గ్రీష్మ ఋతువు

**మంగళవారం, జూన్ 18, 2024**

రాహుకాలం - 15:35 నుండి 17:14 వరకు
యమగండం - 09:00 నుండి 10:39 వరకు
అమృత ఘడియలు - 06:22 నుండి 08:06 వరకు
దుర్ముహూర్తం - 08:10 నుండి 09:02 వరకు
తిథి - ఏకాదశి 06:25 వరకు
నక్షత్రం - స్వాతి 15:55 వరకు




వార్తాప్రభ క్లాసిఫైడ్స్
తెలుగు దినపత్రిక
రోజుకు రూ.300/- మాత్రమే
మినిమం 1X6 నెలకు : రూ.1999/-
మరిన్ని వివరాలకు :
9347993188
- అమ్మకం
- అద్దెకు
- కంప్యూటర్
- ఫర్నీచర్స్
- స్థలం
- ఆటోమొబైల్స్
- కావలెను
- సర్వీసు


## వార్తాప్రభ - రాశిఫలాలు




జ్యోతిష్యశాస్త్రం ప్రకారం, ఈరోజు శివ యోగం, రవియోగం సహా అనేక శుభ యోగాలు ఏర్పడనున్నాయి. ఈ సమయంలో సింహంతో సహా అనేక రాశులకు ఆర్థిక ప్రయోజనాలు కలగనున్నాయి. ఈ నేపథ్యంలో మిగిలిన రాశుల వారికి ఎలాంటి ఫలితాలు రానున్నాయంటే...

**మేష రాశి ఫలితాలు..** ఈ రాశి వారిలో విద్యార్థులు విద్యారంగంలో కొన్ని ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. ఉద్యోగులకు కార్యాలయంలో కొంత ఆటంకం ఏర్పడే అవకాశం ఉంది. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. మీ పనిపై దృష్టి పెట్టండి. లేకుంటే మీరు నష్టాలను చవిచూడొచ్చు.

**వృషభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు కొన్ని కొత్త ఒప్పందాలు చేసుకునే అవకాశం ఉంది. వ్యాపారులు కొన్ని కఠిన నిర్ణయాలు తీసుకోవడం మంచిది. మీ ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలి. మీ ప్రసంగాన్ని నియంత్రించాలి. అర్హతలు పెరగడం వల్ల ఉద్యోగ రంగంలో కూడా విజయం సాధిస్తారు.

**మిధున రాశి వారి ఫలితాలు...** ఈ రాశి వారు ఈరోజు తమ అత్తమామల నుండి ప్రయోజనాలు పొందే అవకాశం ఉంది. సమాజంలో మీ గౌరవం పెరుగుతుంది. ఈరోజు విద్యార్థులు భవిష్యత్ వ్యూహాలను రూపొందించడంలో విజయం సాధిస్తారు. మీకు అన్ని రకాల మద్దతు కూడా లభిస్తుంది.

**కర్కాటక రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు ఏదైనా పాత రుణం ఉంటే దాని నుండి ఉపశమనం పొందే అవకాశం ఉంది. ఏదైనా నిర్దిష్ట పెట్టుబడి నుండి లాభం పొందే అవకాశాలు ఉన్నాయి. విద్యార్థులు పరీక్షల కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. మీ నాయకత్వంలో చేసే పని ఈరోజు విజయవంతమవుతుంది.

**సింహ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు స్నేహితులు, కుటుంబసభ్యులతో కలిసి విహారయాత్రకు వెళ్లాల్సి రావొచ్చు. ఇది ఆహ్లాదకరంగా, ప్రయోజనకరంగా ఉంటుంది. మీ జీవిత భాగస్వామి నుండి పూర్తి మద్దతు పొందుతారు. విదేశాల నుండి వ్యాపారం చేసే వారు ఈరోజు సానుకూల ఫలితాలను పొందుతారు.

**కన్య రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు మనసులో సంతోషంగా ఉంటుంది. మీ సుఖ దుఃఖాలన్నింటిలో మీ జీవిత భాగస్వామి మీకు అండగా ఉంటారు. మరోవైపు ఈరోజు మీరు అనవసరమైన ఖర్చులను ఎదుర్కోవాల్సి ఉంటుంది. ఈరోజు బయటి ఆహారం తీసుకోకుండా సంయమనం పాటించాలి.

**తులా రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారికి ఈరోజు అనుకోకుండా ఒక అపరిచితుడిని కలవడం వల్ల ప్రయోజనకరంగా ఉంటుంది. రాజకీయాల దిశగా చేసే ప్రయత్నాలు ఈరోజు మీకు ప్రయోజనకరంగా ఉంటాయి. ఉద్యోగులు కార్యాలయంలో అధికారుల నుంచి మంచి గౌరవం పొందే అవకాశం ఉంది.

**వృశ్చిక రాశి ఫలితాలు..** రాశి వారు ఈరోజు తమకు రావాల్సిన బకాయిలను తిరిగి పొందొచ్చు. మీ దుబారాను నియంత్రించాల్సి ఉంటుంది. ఉమ్మడి వ్యాపారంలో వృద్ధికి మీ తండ్రి మద్దతు సహాయపడుతుంది. ఈరోజు మీరు ఉద్యోగ రంగంలో ఉన్న సమస్యలకు పరిష్కారాలు పొందుతారు.

**ధనస్సు రాశి వారి ఫలితాలు ..** ఈ రాశి వారు ఈరోజు భాగస్వామ్యంతో ఏదైనా పని చేస్తుంటే, అందులో ఆటంకాలు ఎదురవుతాయి. మీరు విజయం సాధించేందుకు అనేక సవాళ్లను ఎదుర్కోవాల్సి వస్తుంది. కాబట్టి జాగ్రత్తగా ఉండాలి. మీ మధురమైన ప్రసంగం వల్ల సమాజంలో మీ గౌరవం పెరుగుతుంది.

**మకర రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారిలో విద్యార్థులకు ఆశించిన ఫలితాలొస్తాయి. ఉద్యోగులు ఈరోజు కార్యాలయంలో ఉన్నతాధికారుల నుండి పూర్తి మద్దతు పొందుతారు. మీరు కొత్త ప్రణాళికలపై పని చేయడానికి కూడా సమయాన్ని వెచ్చిస్తారు. మీ కుటుంబ బాధ్యతలు ఈరోజు నెరవేరుతాయి.

**కుంభ రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు పిల్లల భవిష్యత్తుకు సంబంధించి కొన్ని శుభవార్తలను వింటారు. ఇది మీ కుటుంబంలో సంతోషాన్ని సృష్టిస్తుంది. ఈరోజు సోదర సోదరీమణులతో సంబంధాలు మెరుగుపడతాయి.

**మీన రాశి వారి ఫలితాలు..** ఈ రాశి వారు ఈరోజు కుటుంబసభ్యుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి. ఆరోగ్య నియమాలను పూర్తిగా పాటించాలి. లేకపోతే మీరు సమస్యలను ఎదుర్కోవాల్సి ఉంటుంది. మీ జీవిత భాగస్వామితో అనుబంధంలో మధురానుభూతి ఉంటుంది.

# జిల్లా ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన ఎమ్మెల్యే కాగిత



**కృత్తివెన్ను,జూన్ 17 (వార్తాప్రభ) :** పెడన నియోజకవర్గ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కృష్ణాజిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి,ఐపీఎస్ ను పోలీస్ క్యాంప్ కార్యాలయం నందు మర్యాద పూర్వకంగా కలవడం జరిగింది. మర్యాదపూర్వక కలయిక లో జిల్లా ఎస్పీ అద్నాన్ నయీమ్ అస్మి పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కు అభినందనలు తెలియ చేసారు . జిల్లా ఎస్పీ ని కలిసిన వారిలో ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ తో పాటు పెడన నియోజకవర్గస్థాయి ఉమ్మడి పార్టీల నాయకులతో పాటుగా కృత్తివెన్ను మండల స్థాయి నాయకులు కూడా ఉన్నారు.

# ఎమ్మెల్యే ఆనందరావును సత్కరించిన ఛాంబర్ సభ్యులు



**అమలాపురం,జూన్ 17 (వార్తాప్రభ) :** సార్వత్రిక ఎన్నికల్లో ఘన విజయం సాధించిన అమలాపురం ఎమ్మెల్యే అయితాబత్తుల ఆనందరావును ది.అసో సియేషన్ ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్య క్షులు కల్వకొలను తాతాజీ ఆధ్వర్యంలో సభ్యులు సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఛాంబర్ కార్యదర్శి యెండూరి నాగబాబు, ఆర్.వి.నాయుడు, కుప్పాల రామకృష్ణ, అడపా వెంకటేశ్వరరావు,రమణాతి రవి తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ వీరాభిమాని గుండె పోటుతో మరణం



**కాకినాడ రూరల్,జూన్ 17 (వార్తాప్రభ) :** జనసేన అధినేత పవన్ కళ్యాణ్ వీరాభిమాని,జనసైనికుడు కాకినాడ రూరల్ చీడిగ వాసి వాయలపల్లి మహేశ్వర రావు (40)శనివారం సాయంత్రం గుండె పోటుతో మరణించాడు.శుక్రవారం ఉదయం అస్వస్థతకు గురికావడంతో కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రిలో చికిత్స పొందుతూ,ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ తుదిశ్వాస విడిచాడు.మహేష్ తన భార్య సత్య,జనసేన పార్టీ అధ్యక్షుడు,పిఠాపురం ఎమ్మెల్యే పవన్ కళ్యాణ్ ను ప్రాణం కంటే ఎక్కువగా అభిమానించే వారు.వీరు ఎన్నికల్లో జనసేన విజయం కోసం తమ వంతు కృషి చేశారు.అయితే ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఉప ముఖ్యమంత్రిగా పవన్ కళ్యాణ్ పదవి చేపట్టడంతో రెట్టింపు ఉత్సాహంతో తన స్నేహితులతో కలిసి తిరిగాడు.ఈ నెల 14వ తేదీన చేబ్రోలులో గల పవన్ గృహానికి చేరుకుని ఇంటి ముందు కలియ తిరుగుతూ ఫోటో లు తీసుకుంటూ అమితానందభరితుడై ,ఉప్పొంగిన హృదయంతో ఇంటికి చేరుకుని ఆ ఆనందాన్ని కుటుంబ సభ్యులతో పంచుకొంటూ ,తాను తీసుకున్న స్నేహితులతో ఫోటోలను, సోషల్ మీడియాలో షేర్ చేసుకుని ఆనందం వ్యక్తం చేసుకున్నాడు. ఇదిలా ఉండగా 14వ తేదీ ఉదయం ఆయనకు గుండె నొప్పి రావడం వైద్య చికిత్స చేయించడం, విధి వక్రీకరించి 15వ తారీకు సాయంత్రం మరణించారు. ఆయనకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు.కుమార్తె 9వ తరగతి,కుమారుడు 6వ తరగతిలో వీరిని సోమవారం స్కూల్ చేర్చాల్సి ఉంది.కాగా తండ్రి తిరిగి రాని లోకానికి వెళ్ళిపోవడంతో దిక్కుతోచని స్థితిలో ఉన్న ఆ చిన్నారులు,కుటుంబ సభ్యులను రోదన స్థానికులను కలచివేసింది.

# చేనేతలను ఆదరించాలి : పెద్దిరాజు



**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** ప్రజలు చేనేత వస్త్రాలు విరివిగా కొనుగోలు చేసి చేనేత కార్మికులను ఆదరించాలని జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి కె.పెద్దిరాజు కోరారు. జిల్లా చేనేత మరియు జౌళి శాఖ అధికారి, కాకినాడ, వారి నిర్వహణలో 16నుండి 22 వరకు 7రోజుల పాటు ఈ ప్రదర్శన ఉంటుందన్నారు.జిల్లా పోలీసు కార్యాలయం ప్రక్కన చేనేత సహకార సంఘముల ఆధ్వర్యములో చేనేత వస్త్ర ప్రదర్శన మరియు అమ్మకములు జరుగుతాయన్నారు. ఈ ప్రదర్శనలో రాష్ట్రంలోని ప్రఖ్యాతి గాంచిన వివిధ జిల్లాల చేనేత మరియు పట్టు వస్త్రాలతోపాటు కాటన్, మెర్సిరైజ్డ్, టై & డై చీరలు, సికో చీరలు, మాధవరం,వెంకటగిరి, జరీ చీరలు, మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, ఉప్పాడ జమధాని చీరలు, షర్టింగ్స్, కలంకారి వస్త్రాలు, పెద్దాపురం సిల్క్ షర్టింగ్స్ మరియు ప్రఖ్యాతి గాంచిన బెడ్ షీట్స్ మరియు ఇంకా పేరెన్నికిగన్న ఆకర్షణీయమైన వస్త్ర ఉత్పత్తులు అందుబాటులో ఉండునన్నారు.ఈ వస్త్ర ప్రదర్శనకు ప్రవేశము ఉచితము మరియు చేనేత ఉత్పత్తులు సరసమైన ధరలకు అందుబాటులో ఉంచబడినవని తెలిపారు. కాకినాడ మరియు పరిసర ప్రాంతములలో ఉన్న ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగపర్చుకొని చేనేత ఉత్పత్తులను కొనుగోలు చేసి, చేనేత వస్త్రాలను ధరించి నేత కార్మికులకు చేయుతనివ్వవలసినదిగా కోరారు.

# స్థలాలు కొనుగోలులో అవినీతికి తెరతీసిన మాజీ ఎమ్మెల్యే ద్వారంపూడి - ఎమ్మెల్యే వనమాడి కొండబాబు ఆరోపణ



**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** కాకినాడ జిల్లా కొమరగిరి లో పేదలకు ఇచ్చిన జగన్న లే అవుట్ పరిశీలించిన.. ఎమ్మెల్యే కొండబాబు, ఇతర నాయకులు, హౌసింగ్ బోర్డు అధికారులు హాజరైయ్యారు.కొమరగిరి ఇళ్ల స్థలాలపై న్యాయ విచారణకు కోరనున్నట్లు కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి కొండబాబు తెలియజేశారు. కొమరగిరి లేఅవుట్ లో ఎదుర్కొంటున్న సమస్యలను లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం కొండబాబు మీడియాతో మాట్లాడుతూ కొమరగిరి ఇళ్ల స్థలాల విషయంలో అవకతవకలు జరిగాయని వాటిపై విచారణ చేయిస్తానని కొండబాబు స్పష్టం చేశారు.వైసీపీ ప్రభుత్వం హయాంలో కాకినాడ నగరానికి 16 కిలోమీటర్లు దూరంలో కొమరగిరి గ్రామంలో సుమారు 350 ఎకరాల్లో పేదల కోసం లే అవుట్ వేశారు .ఇక్కడ 16500 పట్టాలు ఇవ్వగా..ఇందులో 8వేల మంది పునాదులు వేశారు.మిగిలిన 8వేల మంది కనీసం పునాదులు వెయ్యలేదు.. ఇక్కడ కేవలం 250 మంది మాత్రమే ఇల్లు నిర్మాణం చేసారు. మా ప్రభుత్వం హయాంలో టిడ్కో ఇల్లు నిర్మించి ఉన్నా అవి పేదవాళ్ళకు ఇవ్వలేదు సాగరమాల ప్రాజెక్టు కోసం ఎకరం పొలం 20 లక్షలకు కొనుగోలు చేస్తే.. ఇక్కడ అదే పొలాలను ద్వారంపూడి 45 లక్షలు చొప్పున కొనుగోలు చేసి వేల కోట్లు కాజేసాడు. కనీస మౌలిక సదుపాయాలు కూడ ఏర్పాటు చెయ్యలేదు ద్వారంపూడి చంద్రశేఖర్ రెడ్డి.. ఆయన పరిపాలన కన్నా.. తెలుగుదేశం నాయకులు. జనసేన నాయకుల పైన కేసులు పెట్టించడం.. బూతులు తిట్టడం తప్పా పరిపాలన చెయ్యలేదు .ఇక్కడ జరిగిన అవినీతి పైన నివేదికను.. మా అధిష్టానానికి ఇస్తాము.కాజేసిన డబ్బులు పైసాతో సహా వసూలు చేస్తామన్నారు

# అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తాం : ఎమ్మెల్యే పంతం నానాజీ



**కాకినాడ రూరల్,జూన్ 17 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వం హామీ మేరకు అంగన్వాడీలకు ఉద్యోగ భద్రత కల్పిస్తామని పంతం నానాజీ అన్నారు. సోమవారం కాకినాడ నగరం గొడారి గుంట ఎమ్మెల్యే నివాసం వద్ద కాకినాడ రూరల్ నియోజవర్గానికి సంబంధించిన అంగన్వాడీ కార్యకర్తలు గౌరవప్రదంగా కలిసి ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వం గత ఐదేళ్లలో అంగన్వా డీలను తీవ్రంగా ఇబ్బందులకు గురి చేసిందని, చంద్రబాబు పవన్ కళ్యాణ్ నాయకత్వంలో అంగన్వాడీలకు పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని ఆయన పేర్కొన్నారు.

**ఎమ్మెల్యే నానాజీకి అభినందనల వెల్లువ**

కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు నానాజీ గెలుపు నేపథ్యంలో సోమవారం కూడా శుభాకాంక్షలతో అభినందనల వెల్లువ తలపించింది.ఉదయం నుండి జనసేన,తెలుగు దేశం,భాజపా నాయకులు,కార్యకర్తలతో పాటు ప్రభుత్వ ఉన్నతాధికారులు, ఆయా మత పెద్దలు అధిక సంఖ్యలో పాల్గొని ఎమ్మెల్యే పంతం నానాజీకి శుభాకాంక్షలు తెలియజేశారు.

# ఎంపీ,ఎమ్మెల్యే లను కలిసిన న్యూ సెంచురీ స్కూల్ అధినేత ,డాక్టర్ వెంకట్ యం



**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** కూటమి ప్రభుత్వంలోని ఎంపీ, ఎమ్మెల్యేలుగా అత్యధిక మెజార్టీతో విజయం సాధించిన, కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ను, కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు (కొండబాబు ), ను కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావును ప్రముఖ ఆర్కిటెక్టు, న్యూ సెంచరీ స్కూల్ అధినేత, డా.వెంకట్ యం మర్యాద పూర్వకంగా కలిసి అభినందనలు తెలియజేశారు.

# సంకురాత్రి ఫౌండేషన్ సేవలు అభినందనీయం : ఎమ్మెల్యే పంతం నానాజీ





**కాకినాడ రూరల్,జూన్ 17 (వార్తాప్రభ) :** కిరణ్ కంటి ఆస్పత్రి వారి సంకురాత్రి ఫౌండేషన్ సేవలు అభినందనీయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) అన్నారు.కాకినాడ రూరల్ కొవ్వూరు గ్రామంలో కిరణ్ కంటి ఆస్పత్రి వారి సౌజన్యంతో ఉచిత కంటి వైద్య పరీక్షల శిబిరాన్ని కాకినాడ రూరల్ జనసేన పార్టీ మండల అధ్యక్షుడు కర్రెడ్ల గోవింద్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరై శిబిరంలో జరుగుతున్న కంటి వైద్య పరీక్షలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెద్ద వయసు వారికి ఎక్కువగా నేత్ర సమస్య వస్తుందని, ఇలాంటి శిబిరాల ద్వారా పరీక్షించుకుని, ఆపరేషన్లు చేయించుకుంటే కంటి చూపు మెరుగుపడుతుందన్నారు. ఇలాంటి అవకాశాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకొని సమస్యను పరిష్కరించుకోవాలని ఎమ్మెల్యే కోరారు. గ్రామంలో ఇప్పటివరకు 150 మంది కంటి వైద్య పరీక్షలు చేయించుకోగా 40 మందికి ఆపరేషన్లు పడతాయని ప్రోగ్రాం ఆఫీసర్ సత్యనారాయణ వెల్లడించారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# కొవ్వాడలో పంతం నానాజీ విజయోత్సవ సంబరాలు



**కాకినాడ రూరల్,జూన్ 17 (వార్తాప్రభ) :** జనసేన అభ్యర్థి పంతం వెంకటేశ్వరరావు (నానాజీ) 72,040 ఓట్ల మెజారిటీతో గెలుపొందిన తరుణంలో కాకినాడ రూరల్ కొవ్వాడ గ్రామంలో జనసేన నాయకుడు ర్యాలీ సతీష్ , జనసైనికుల ఆధ్వర్యంలో విజయోత్సవ సంబరాలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ హాజరై మాట్లాడుతూ గ్రామం మొత్తం సంపూర్ణ మద్దతుతో నా విజయానికి కృషి చేసిన అందరికీ ధన్యవాదాలు తెలియజేశారు. కులమత బేధం లేకుండా ఓట్లు వేసి అత్యధిక మెజారిటీ అందించిన ప్రజలకు నిరంతరం అందుబాటులోనే ఉంటానన్నారు. ఇదే ఉత్సాహంతో ఈ ఐదేళ్లు మన సమస్యలను పరిష్కరించుకోవాలని జన సైనికులకు తెలిపారు.అనంతరం జన సైనికులు ఏర్పాటు చేసిన ప్రేమ విందును గ్రామస్తులంతా స్వీకరించారు.ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో నాయకులు, జన సైనికులు పాల్గొన్నారు.

# ప్రకృతిలో ఉన్న ప్రతి జీవరాశిని కాపాడుకుందాం



**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** ప్రకృతిలో ఉన్న ప్రతి జీవరాశిని కాపాడుకునే బాధ్యత మానవునిపై ఉందని జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి, కార్యదర్శి వి.ఎల్.ఎన్.ఎస్.వి ప్రసాద్ అన్నారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవ పురస్కరించుకుని జూన్ 5వ తేదీన నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలకు ఆదివారం నాడు జిల్లా కేంద్ర గ్రంథాలయంలో బహుమతులు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాస్త్ర సాంకేతిక మండలి మరియు సైన్స్ సిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన జిల్లా కేంద్ర గ్రంథాలయ అధికారి మరియు కార్యదర్శి వి.ఎల్.ఎన్.ఎస్.వి ప్రసాద్ మాట్లాడుతూ పర్యావరణాన్ని కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని అన్నారు. అడవులను నరకడం అరికట్టాలని, వృక్ష సంపద వృద్ధి చేయాలని, ప్రతి ఒక్కరూ మొక్కలను వేల సంఖ్యలో నాటి సంరక్షించే బాధ్యత చేపట్టాలన్నారు. ఒక వ్యక్తిగా గాని సమూహంగా కాని మొక్కలు నాటే కార్యక్రమాన్ని బాధ్యతగా నిర్వహించాలని పిలుపునిచ్చారు. ఉప గ్రంథాలయ అధికారి కె.కిషోర్ మాట్లాడుతూ ఇంధన వనరులను పొదుపుగా వాడాలన్నరు.ప్రతి ఒక్కరూ సౌర శక్తి వినియోగానికి మార్గాలను అన్వేషించాలని పిలుపునిచ్చారు. ప్లాస్టిక్ బ్యాగ్స్ వాడకాన్ని నిషేధించాలని, వాటికి బదులుగా కాగితపు సంచులను, గుడ్డ సంచులను,నారా సంచులను వినియోగించాలని తెలిపారు.జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ జిల్లా సమన్వయకర్త కేసరి శ్రీనివాసరావు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచి పర్యావరణం పట్ల అవగాహన పెంచుకోవాలన్నారు. రిసోర్ పర్సన్ వి.ఎస్.వి.రమణమూర్తి మాట్లాడుతూ ప్రకృతిలో గాలి,నీరు,ఆహారం, పర్యావరణం కాలుష్యం కాకుండా ప్రతి ఒక్కరూ బాధ్యత వహించాలని తెలిపారు. గ్రంధాలయాదికారులు డి.రవికుమార్,వి.అరుణ, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

# పిల్లి కళ్యాణ్ కృష్ణ తీరుపై టీడీపీ అధిష్టానానికి ఫిర్యాదు

- ఎమ్మెల్యే పంతం
- వైసీపీకి పనిచేసి మంత్రి ఫోటోతో ప్రచారం



**కాకినాడ, జూన్ 17 (వార్తాప్రభ) :** తల్లిదండ్రులు మాజీ ఎమ్మెల్యే పిల్లి అనంతలక్ష్మి ఆమె భర్త పిల్లి సత్తిబాబులు చెప్పినా వినకుండా కూటమి అభ్యర్థిని ఓడించాలని ప్రయత్నించిన వారి కుమారుడు పిల్లి కళ్యాణ్ కృష్ణ అని మంత్రితో ఒక ఫోటో తీసుకుని ఇక్కడ పార్టీల కేడర్ను తప్పుదోవ పట్టిస్తున్నారని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ అన్నారు. సోమవారం గొడారిగుంటలో నివాసం వద్ద రూరల్ టీడీపీ శ్రేణులతో కలిసి మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా నానాజీ మాట్లాడుతూ ప్రధానంగా తన గెలుపునకు టిడిపి మాజీ ఎమ్మెల్యే పిల్లి దంపతులు, కో ఆర్డినేటర్ కటకంశెట్టి బాబి, టీడీపీ నాయకులు వాసిరెడ్డి ఏసుదాసు, నులుకుర్తి వెంకటేశ్వరరావు, పెంకే శ్రీనివాస్ బాబా, చప్పిడి వెంకటేశ్వరరావులు వంటి నాయకులు శక్తి వంచన లేకుండా తిరుగుతూ విజయానికి కృషి చేశారన్నారు. కానీ పిల్లి కళ్యాణ్ కృష్ణ అనే వ్యక్తి వైసీపీతో చేతులు కలిపి పిల్లి దంపతులకు తనకు చాలా బాధ కలిగించే విధంగా వ్యవహరించాడన్నారు. వైసీపీతో తిరుగుతూ కాకినాడ రూరల్లో తనను ఓడిస్తానంటూ ఛాలెంజ్ కూడా ప్రకటించారన్నారు. వైసీపీ వారితో కలిసి పోలింగ్ కేంద్రాల వద్ద నగదును పంచి ఇప్పుడు మంత్రి సుభాష్తో ఒక ఫోటో దిగి కాకినాడ రూరల్లో పలుచోట్ల ప్లెక్సీలతో జోరుగా ప్రచారం చేసుకుంటున్నారన్నారు. కళ్యాణ్ కృష్ణ తీరుపై టీడీపీ నాయకులకు, కార్యకర్తలకు బాధ కలిగిస్తుందని అందువల్ల టీడీపీ అధిష్టానం దృష్టికి తీసుకెళ్తామని ఎమ్మెల్యే నానాజీ పేర్కొన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఎన్నికల సమయంలో పిల్లి కళ్యాణ్ కృష్ణ కూటమి నియమాలకు విరుద్ధంగా, వ్యతిరేకంగా వ్యవహరించిన తీరుపై వారు మండి పడ్డారు.

## కాంగ్రెస్ పార్టీలో యువతకు ప్రత్యేక స్థానం, తగిన ప్రోత్సాహం-కాంగ్రెస్ నేత శేరి సతీష్ రెడ్డి.



**కూకట్ పల్లి, జూన్ 17 (వార్తాప్రభ):**కాంగ్రెస్ పార్టీ కోసం నిరంతరం కష్టపడే యువతకు పార్టీ ప్రత్యేక గుర్తింపు, తగిన గుర్తింపు ఇస్తుందని కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ మాజీ అధ్యక్షులు సతీష్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారంకూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీలో యువతను ప్రోత్సహిస్తున్న కాంగ్రెస్ నాయకులు,యువజన కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షుడు శివసేన రెడ్డి,మల్కాజిగిరి పార్లమెంట్ ఇంచార్జ్ పట్నం సునీత మహేందర్ రెడ్డి ఆదేశాల మేరకు కూకట్ పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ సహకారంతో కూకట్ పల్లి నియోజకవర్గం మాజీ అధ్యక్షులు శేరి సతీష్ రెడ్డి మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు కండి శ్రావణ్ తో చర్చించి నియోజకవర్గం స్థాయి మరియూ డివిజన్ నూతన కమిటీని వేశారు. కూకట్ పల్లి నియోజకవర్గం యువజన ప్రధాన కార్యదర్శులుగా జేరిపటి రాజు,ఎండీ రావుఫ్, యువజన కార్యదర్శిగా వినయ్ గౌడ్ , యువజన సహాయ కార్యదర్శి గా హరి, ఫతేనగర్ డివిజన్ యువజన వర్కింగ్ ప్రెసిడెంట్ రాకేశ్ లను నూతనంగా నియమించారు. ఈ సందర్భంగా సతీష్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ కోసం కష్ట పడుతున్న వారికి కాంగ్రెస్ పార్టీ లో యువతకు మంచి అవకాశాలు కల్పిస్తుందన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేస్తున్న యువతను కాంగ్రెస్ పార్టీ ఆదరిస్తుందని అందుకే రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిందన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎప్పుడు యువతకు అండగా ఉంటుదని నియోజకవర్గంలో ఇంకా ఎవరైతే ఉన్నారో వారికి కూడా రాబోయే రోజులో మంచి భవిష్యత్ ఉంటుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు సంజీవ రావు, మైఖేల్, ఫణీంద్ర, మహిళ నాయకురాలు రజిత,జోజమ్మ, కుమ్మ బాబు,లోగి రాజు, బాలానగర్ వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రసన,సోనూ,రాజు, స్థానిక నాయకులు,కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

## డాక్టర్ రావుస్ ఈఎన్ టీ వైద్యశాలలో ఘనంగా ఫాదర్స్ డే వేడుకలు....





**కూకట్ పల్లి, జూన్ 16(వార్తాప్రభ):**కె.పి.హెచ్.బి. కాలనీలోని డాక్టర్ రావుస్ ఈ ఎన్ టీ వైద్యశాలలో ఫాదర్స్ డే వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కె.పి.హెచ్.బి కాలనీ లోని డాక్టర్ రావుస్ ఈ ఎన్ టీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా నిర్వహించిన కాక్లియర్ ఇంప్లాంట్ సర్జరీ విజయవంతంగా పూర్తి చేసిన చిన్నారులు, తల్లిదండ్రులతో కలిసి ఫాదర్స్ డే వేడుకలు జరిగాయి . వేడుకలకు ముఖ్య అతిథులుగా వైద్యశాల చైర్మన్ డాక్టర్ జి వి ఎస్ రావు, మేనేజింగ్ డైరెక్టర్ చైతన్య రావు, డైరెక్టర్ శ్రీ రావు లు పాల్గొన్నారు. చిన్నారులతో కలిసి కేక్ కట్ చేసి, ఆటపాటలతో సందడి చేశారు. చిన్నారులకు గిఫ్ట్ లను ( స్కూల్ బ్యాగ్, కంపాక్స్ బాక్స్,లంచ్ బాక్స్, పెన్సిల్లు తో కూడిన కిట్) అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... చిన్నారులు మాటలు రాకపోవడానికి ప్రధానమైన కారణం... పుట్టుకతోనే చిన్నారుల చెవిలో లోపాలు ఉండడమేనని.... చెవికి సంబంధించిన వైద్య పరీక్షలు చేయించి అనుభవజ్ఞులైన డాక్టర్లతో శస్త్ర చికిత్స చేయిస్తే...మాటలు రాని చిన్నారులు తిరిగి మామూలు మనుషుల్లా మాట్లాడగలుగుతారని ఆ పిల్లల మొహాల్లో చిరునవ్వు కనిపిస్తుందని అన్నారు. మాటలు రాని చిన్నారులలో లోపాలను సకాలంలో గుర్తించి సరైన శస్త్ర చికిత్సలు చేయించాలని వారికి బంగారు భవిష్యత్తును అందించాలని తల్లిదండ్రులను కోరారు సమాజంలో ఎందరో చిన్నారులు మూగ చెవిటి సమస్యలతో బాధపడుతున్నారని వారందరికీ సేవ చేయాలన్న సంకల్పంతో రావు ఈ ఎన్ టీ వైద్యశాల ఆధ్వర్యంలో ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంట్ శస్త్ర చికిత్సను అందిస్తున్నామనీ తెలిపారుఇప్పటివరకు వైద్యశాలలో 50 మందికి పైగా పేద చిన్నారులకు ఉచితంగా అత్యాధునిక వైద్య పరికరాలతో అనుభాగ్యులైన డాక్టర్ శ్రీ రావు పర్యవేక్షణలో శస్త్ర చికిత్సలు నిర్వహించి వారికి తిరిగి మాటలు వచ్చేలా చేయడం జరిగిందన్నారు.వైద్యశాల ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత కక్లియర్ ఇంప్లాంట్ చికిత్స సేవలను పేద ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. భవిష్యత్తులో పేదలకు మరిన్ని వైద్య సేవలను ఉచితంగా అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో వైద్యశాల డాక్టర్లు సిబ్బంది చిన్నారుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## ఆలయ పునర్నిర్మాణ పనులను పరిశీలించిన ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య



**జగ్గయ్యపేట జూన్ 17 (వార్తప్రభ)**పట్టణం లోని లోని పాలేటి తీరంలో కొలువై ఉన్న శ్రీ అన్నపూర్ణ సమేత కాశీ విశ్వేశ్వర స్వామి వారి ఆలయం ( మఠం శివాలయం) పునర్నిర్మాణ పనులను జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య భక్తులతో కలిసి పరిశీలించారు. సోమవారం ఆలయ ఆవరణలో స్వామివారి గర్భాలయ నిర్మాణ పనులను ఆలయ ప్రవేట్ కమిటీ ప్రతినిధులతో కలిసి పరిశీలించి ఆలయ నిర్మాణానికి అయ్యే ఖర్చు మరియు గర్భాలయము ఎంత ఎత్తులో నిర్మిస్తున్నారు ఆలయానికి సంబంధించిన ప్లాను ఇతర విషయాలను అడిగి తెలుసుకున్నారు. పంచాయతన క్షేత్రమైన ఈ ఆలయం పునర్నిర్మాణం పూర్తి కావాలని ఆకాంక్షిస్తున్నట్లు తెలిపారు . ఈ కార్యక్రమంలో ఆలయ ప్రవేట్ కమిటీ ప్రతినిధులు భక్తులు పాల్గొన్నారు

# ఆయా ఈద్గా లలో ఘనంగా నిర్వహించిన బక్రీద్ ప్రార్థనలు...

■ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ కార్యదర్శి కాలేషా





**జవహార్ నగర్,జూన్,17:(వార్తా ప్రభ)**జవహార్ నగర్ మున్సిపల్ పరిధిలో గల ఆయా ఈద్గా లలో బక్రీద్ ఈదుల్ జూహా ప్రార్థన లు ప్రశాంతంగా జరిగాయి సోమవారం రోజున వెంకటేశ్వర కాలనీలోని పాత ఈద్గా లో ఇమామ్ ఎండి సాబేర్ మరియు ఎండి. ముజాహ్ద్ ఆలం, వికలాంగుల కాలనీలోని నయా ఈద్గా లో ముఫ్తీ జావేద్ మౌలానా, మరియు సుల్తాన్ మౌలానా, అంబేద్కర్ నగర్ ఈద్గా లో హాఫిజ్ ఎండి. ముఫ్తీ సర్వర్ సాబ్, మల్కారం ఈద్గాలో ఇమామ్ షైబాజ్ ఆలం, ఫరానగర్ ఈద్గా లో ఇమామ్ ఎండి సాబిర్, అరుంధతి నగర్ ఈద్గా లో ఇమామ్ మాషక్ హుక్ జమ, వైయస్సార్ నగర్ డంపింగ్ యాడ్ ఈద్గా లో హాఫిజ్ ఇమామ్ ముర్తుజా ఆలం సాబ్, సమక్షంలో ప్రార్థనలు జరిగాయి. ఈ కార్యక్రమంలో జవహార్ నగర్ ముస్లిం వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ అధ్యక్షులు ఎండి పాషామియా కార్యదర్శి కాలేష అల్లా అన్ని వర్గాల ప్రజలకు అండగా ఉండి మంచి జరిగేలా కరుణించాలని ప్రార్థించడం జరిగింది. హకీమ్ ఖాన్ సాబ్, షేక్ అహమద్, షేక్ షఫీ, ఎండి వహీద్, మౌలానా ఖాద్రి, మౌలానా, షేక్ ఇస్మాయిల్, షేక్ హబీబ్, టీ మస్తాన్, ఎండి యూసుఫ్ ఖాద్రి , ఉమర్ దరాస్, సయ్యద్ ముబషీర్ అలియాస్ అబ్బు, అఫ్జల్ ఖాన్, సయ్యద్, ఎండి మోహిత్, ఎండి సోహెల్, సలావుద్దీన్, అఫ్జల్, అఖ్తర్, ఎండి. ఉమర్ షరీఫ్, ఎండి నూరుద్దీన్ అలియాస్ అక్రమ్, అహ్మద్, ఆర్.ఎం.పి డాక్టర్ యూసుఫ్, ఎండి మోయిన్, ఎండి కలీం, ఎండి నూరుద్దీన్ ఫారూఖ్, ఎండి షాబుద్దీన్ అలియాస్ అబ్బు, ఎండి కరమ్ ఖాన్, హసన్, ఎండి జావీద్ తదితరులు పాల్గొన్నారు, ఈ కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగిసినందుకు పూర్తి స్థాయిలో సహకరించిన పోలీస్ శాఖకు ధన్యవాదాలు తెలియజేయడం జరిగింది.

# ఘనంగా మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ జన్మదిన వేడుకలు

■ జన్మదిన వేడుకల్లో పాల్గొన్న సొంటి రెడ్డి పున్నారెడ్డి



**కుత్బుల్లాపూర్ జూన్ 17 (వార్తాప్రభ) :** కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కూన శ్రీశైలం గౌడ్ పుట్టినరోజు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ వేడుకలకు టిపిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, కుత్బుల్లాపూర్ కాంగ్రెస్ నాయకులు సొంటి రెడ్డి పున్నారెడ్డి హాజరై ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా పున్నారెడ్డి మాట్లాడుతూ... ప్రజల నాయకుడు అనునిత్యం ప్రజా సేవ చేస్తున్న శ్రీశైలం గౌడ్ ఆయురారోగ్యాలతో అష్టైశ్వర్యాలతో ఉండాలని కోరుకుంటున్నానని అన్నారు. ఈ కార్యక్రమంలో లిమేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా మహిళా అధ్యక్షురాలు ఆర్. లక్ష్మి ,129 డివిజన్ కాంగ్రెస్ పార్టీ ప్రెసిడెంట్ రహమతుల్లా, మహిళా నాయకులు,సరభారెడ్డి , రాజ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# మల్కాజ్ గిరి ప్రజల సమస్యలు తీర్చే బాధ్యత నాది- ఎంపీ ఈటల రాజేందర్



**మల్కాజిగిరి జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** మల్కాజిగిరి నియోజక వర్గంలో దీర్ఘకాలికంగా పెండింగ్లో ఉన్న ఆర్యుబి, భూగర్భ డ్రైనేజీ, ప్రభుత్వ భూముల క్రమబద్ధీకరణ వంటి అనేక సమస్యలు పరిష్కరించేందుకు తాను ప్రజలతో ఉంటానని ఎంపీ ఈటెల రాజేందర్ అన్నారు. ఎంపీగా తనను గెలిపించిన ప్రజలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ప్రజల సమస్యల పరిష్కారమే తన బాధ్యత అని వారి సేవకుడిగా నిరంతరం వారికి అందుబాటులో ఉంటానని అన్నారు. వినాయక నగర్ కార్పొరేటర్ రాజలక్ష్మి ఆధ్వర్యంలో మున్నూరు కళ్యాణ మండపంలో సోమవారం వినాయక నగర్ డివిజన్ కాలనీల సంక్షేమ సంఘాల ప్రతినిధులతో ఆయన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ రాజ్యలక్ష్మి ఈటలను సత్కరించారు. డివిజన్ పరిధిలో నెలకొన్న రైల్వే వంతెనెల సమస్యలు, కలుషిత చెరువులు, నాళాల అభివృద్ధి మొదలగు సమస్యలను పరిష్కరించాలని ఈటెలకు ఆమె వినతి పత్రం ఇచ్చారు. దీనిపై ఈటెల స్పందించి మల్కాజ్గిరి లో నెలకొన్న అనేక సమస్యల్ని పరిష్కరించే బాధ్యత తన దన్నారు. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవడం నాయకుడిగా తన బాధ్యత అన్నారు. వచ్చే ఐదు ఏళ్లలో మల్కాజ్గిరిని ఆదర్శ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని అన్నారు. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలోని కాలనీ సంక్షేమ సంఘాల నాయకులు మహిళలు టీడీపీ నాయకులు ఈటలను సత్కరించి వారి కాలనీలో నెలకొన్న సమస్యలను ఆయనకు వివరించారు. వాటిని పరిష్కరించే బాధ్యత తనదని వారికి హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ శ్రవణ్ కుమార్, బీజేవైఎం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు భాను ప్రకాష్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీకే మహేష్, రాష్ట్ర బీసీ నాయకులు గణేష్ చారి, సీనియర్ నాయకులు వడ్డీ సుబ్బారావు, ఓం ప్రకాష్, నవీన్ , సాయి సురేష్, శ్రీకాంత్, నరసింహగౌడ్ , జగదీష్ , గోపాల్, నరేందర్, శివ, మహేష్, తదితరులు పాల్గొన్నారు.




# రవి యాదవ్ కు ఘన సన్మానం.



**కూకట్ పల్లి, జూన్ 17 (వార్తాప్రభ):**చేవెళ్ల పార్లమెంట్ ఎన్నికలలో భారీ విజయం సాధించిన బిజెపి అభ్యర్థి కొండా విశ్వేశ్వర్ రెడ్డి కి శేరిలింగంపల్లి నియోజకవర్గం నుండి అత్యధిక మెజారిటీ రావడానికి కృషిచేసిన శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంటెస్ట్ ఎమ్మెల్యే రవి కుమార్ యాదవ్ ని వారి కార్యాలయంలో బీజేవైఎం రాష్ట్ర అధికార ప్రతినిధి అమర్నాథ్ యాదవ్ తో కలిసి బిజెపి నాయకులు కుమార్ యాదవ్ శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా కుమార్ యాదవ్ మాట్లాడుతూ పార్లమెంట్ ఎన్నికలలో బిజెపి అభ్యర్థి గెలుపు కొరకు కృషిచేసిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు అన్నారు. ఇదే ఉత్సాహంతో పనిచేస్తూ నిరంతరం ప్రజా సమస్యల పరిష్కారం కోసం రాష్ట్ర ప్రభుత్వం పైన ఒత్తిడి తీసుకొస్తామని అన్నారు. అలాగే రానున్న జిహెచ్ఎంసి ఎన్నికలలో కూడా ఇంతే రెట్టింపు ఉత్సాహంతో పని చేసి విజయం సాధిస్తామని అన్నారు..



## త్యాగనిరతికి ప్రతీక ఈద్ అల్ జుహా

■ షేక్ హాజీ గౌస్

**కనిగిరి జూన్ 17 వార్తా ప్రభ ప్రతినిధి**కనిగిరి నియోజకవర్గం పామూరు పట్టణ ముస్లిం మైనారిటీ నాయకులు షేక్ హాజీ గౌస్ ముస్లిం సోదర సోదరీమణులకు ఈద్ అల్ జుహా (బక్రీద్) శుభాకాంక్షలు తెలిపారు. బక్రీద్ పండగ పర్వదినాన ఖుర్బానీ ఇచ్చి ఆ త్యాగ నిరతిని స్మరించుకుంటూ ఆ మొహమ్మద్ ప్రవక్త కృపకు పాత్రులు అవుతారని హాజీ గౌస్ పేర్కొన్నారు. షేక్ గౌస్ బాషా, షేక్ చిన్న హాజిమలన్ (అష్రఫ్ రైస్ ట్రేడర్స్), షేక్ సుభాని, సుజాత అలీ, సింగనపల్లి రజాక్, షేక్ మస్తాన్, షేక్ అబ్దుల్ ఖాదర్, షేక్ జిలాని భాష శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.

## సుజనా చౌదరిని మర్యాదపూర్వకంగా కలిసిన దారపనేని



**కనిగిరి జూన్ 17 వార్తా ప్రభ ప్రతినిధి** విజయవాడ పశ్చిమ నియోజకవర్గం శాసనసభ్యులు వై సృజనా చౌదరిని సోమవారం కనిగిరి మాజీ ఏఎంసీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. రాష్ట్రంలో సైకో పాలన అంతమొందించడానికి రాష్ట్ర ప్రజలందరూ కలిసికట్టుగా కూటమి ప్రభుత్వానికి పట్టం కట్టారని, ఇది ప్రజా విజయమని, రాష్ట్రాన్ని చంద్రబాబు నాయుడు అభివృద్ధి వైపు పరుగులు పెట్టించగల సత్తా ఉన్న నాయకుడిని ఎన్నుకున్నారని దారపనేని పేర్కొన్నారు. సుజనా చౌదరిని అభినందించిన వారిలో తూర్పు కోడిగుడ్లపాడు మాజీ ఎంపీటీసీ చెనికల పెదమాల కొండయ్య, చెనికల చిన్న మాల కొండయ్య, చిన్న కొండారెడ్డి ఉన్నారు.

## ముస్లిమ్ సోదరులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే



**కుత్బుల్లాపూర్ జూన్ 17 (వార్తాప్రభ)** : బక్రీద్ పండుగ సందర్భంగా కుత్బుల్లాపూర్ లోని ఎమ్మెల్యే నివాస కార్యాలయం వద్ద నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, కార్యకర్తలతో కలిసి సోమవారం ఎమ్మెల్యే కేపీ.వివేకానంద బక్రీద్ పండుగలో పాల్గొని ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ అల్లాకు తన కొడుకును బలిచ్చేందుకు ఒక తండ్రి సన్నద్ధమవగా, వారి త్యాగాలకు మెచ్చిన అల్లా కొడుకుకు బదులుగా ఒక బక్రీని బలివ్వమని తెలుపగా నాటి నుంచి బక్రీద్ పండుగ ప్రారంభమైందన్నారు. ముస్లిం సోదరులు అత్యంత ఆనందోత్సవాల మధ్య తమను తాము అల్లాకు సమర్పించుకుంటూ పేదవారికి సహాయం చేస్తూ నిర్వహించుకునే పండుగలలో ఒకటి బక్రీద్ అని ఈ సందర్భంగా నియోజకవర్గంలోని ముస్లిం సోదరులందరికీ బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గానికి చెందిన పలువురు మైనారిటీ నాయకులు, కార్యకర్తలు, బిఆర్ఎస్ పార్టీకి చెందిన సీనియర్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## కేఎం ప్రతాప్ కు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేసిన పలు కాలనీ, బస్తీ వాసులు



**కుత్బుల్లాపూర్ జూన్ 17 (వార్తాప్రభ) :** బక్రీద్ పండుగ సందర్భంగా, కుత్బుల్లాపూర్ గ్రామం, గాంధీ నగర్, నందానగర్, వెంకటరామిరెడ్డి నగర్ పలు కాలనీలా, బస్తీలా ముస్లిం సోదరులు, సోమవారం రంగారెడ్డి జిల్లా మాజీ డిసిసి అధ్యక్షులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు, కె.యం.ప్రతాప్ ని కలిసి బక్రీద్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. అనంతరం ప్రతాప్ ముస్లిం సోదర, సోదరీమణులకు బక్రీద్ పండుగ శుభాకాంక్షలను తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మహమ్మద్ సిరాజ్, షేక్ బాబుమియా, షేక్ గౌస్, మహమ్మద్ మక్బూల్, మహమ్మద్ రషీద్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్పీకి ఈద్ శుభాకాంక్షలు తెలిపిన సనాతన హిందూ ఉత్సవ సమితి

**అదిలాబాద్ జూన్ 17 (వార్తాప్రభ) :**సోమవారం రోజు జిల్లా ఎస్పీ గౌస్ ఆలం ను సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు ఈద్-ఉల్ ఆదా (బక్రీద్) పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ స్వీటు తినిపించారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రశంస పత్రం పొందిన సందర్భంగా ఎస్పీకి అభినందనలు తెలిపారు.

# ఎడిటోరియల్

## పేద రాష్ట్రంలో పెద్ద ఆశలు.... బాబుకు పెను సవాల్!

ఎవరు ఒప్పుకున్నా లేకపోయినా ఏపీ పేద రాష్ట్రం. భౌగోళికంగా ఏపీ తెలంగాణా కంటే పెద్దది కావచ్చు. కానీ పూర్తిగా వ్యవసాయిక రాష్ట్రంగా ఉంది. సేవా రంగం లేదు, పరిశ్రమలు లేవు, వ్యాపారాల జోరు లేదు, ఏ ఇతర రంగాల నుంచి ఆదాయలు వచ్చే మార్గాలు లేవు. దానికి తోడు విభజన గాయాలు ఉన్నాయి. అలాగే అప్పుల కుప్పగా ఏపీ మారిపోయింది. పది లక్షల కోట్ల పై చిలుకు అప్పులు ఉన్నాయని ఒక అంచనా.ఒక విధంగా చెప్పాలంటే ఏపీ ఎన్నడూ లేని విధంగా అనేక రకాలైన సంక్షోభాలను ఎదుర్కొంటోంది. ఈ రాష్ట్రాన్ని ఒడ్డున పడేయగలరు అన్న ఆశతో ఎంతో అనుభవం ఉన్న చంద్రబాబును ఎపీలోని కోట్లాది మంది ప్రజలు అంతా ముక్తకంఠంతో ఎన్నుకున్నారు. ఇంతటి విషమ పరిస్థితుల్లో ఏపీకి బాబు ఒక్కటే ఆశ. ఆయనను చూసుకునే అంతా ధైర్యంగా ఉన్నారు.చంద్రబాబు తన అర్ధ శతాబ్దపు రాజకీయ అనుభవంతో ఏపీని దేశంలో అన్ని విధాలుగా ముందుకు పరుగులు తీయిస్తారు అని అంటున్నారు. ఈసారి ఎన్నికల ఫలితాలు చూస్తే ఒక వర్గం కాదు ఒక ప్రాంతం అని కాదు అంతా కలసి అతి భారీ మెజరిటీతో బాబుకు పట్టం కట్టారు. చంద్రబాబు మీద ఉన్నత వర్గాలు మధ్యతరగతి దిగువ తరగతి అంతా కలసి మూకుమ్మడి ఓట్లు కూటమికి వేశారు అంటే చంద్రబాబుని చూసుకునే అని అంటున్నారు.దిగువ తరగతి వర్గం గురించి చెప్పుకోవాలంటే వారంతా బాబు ప్రభుత్వం నుంచి భారీ సంక్షేమ కోరుకుంటున్నారు.వృద్ధులకు నాలుగు వేల పెన్షన్ తో పాటు ఇంటికి మూడు గ్యాస్ సిలిండర్లు ఉచితంగా ఇస్తామన్నదానికి వారు ఆకర్షితులు అవుతున్నారు. అలాగే మహిళలకు ఉచిత బస్సు సదుపాయం, తల్లికి వందనం పేరిట ఏటా ఇచ్చే పదిహేను వేల రూపాయలు 18 ఏళ్లు పైబడిన వారి కోసం ప్రజలు ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఈ పథకాలలో కొన్నింటిని నెరవేర్చడం ప్రభుత్వానికి చాలా సవాలుగా ఉంటుందని అంటున్నారు.మరో వైపు చూస్తే ఉన్నత వర్గాల ఆశలు వేరే విధంగా ఉన్నాయి. వారు అభివృద్ధి కోరుకుంటున్నారు. ఏపీకి ప్రత్యేక హెూదా చంద్రబాబు తీసుకుని రాగలడని నమ్ముతున్నారు. హెూదా వస్తే కనుక తమ వ్యాపారాలకు ఎంతో బాగుంటుందని ఆశిస్తున్నారు. అలాగే అమరావతి రాజధాని పూర్తి అయితే అన్ని రంగాలూ పరుగులు పెడతాయని వారు భావిస్తున్నారు. అలాగే వివిధ పన్నుల నుండి మినహాయింపు ప్రత్యేక ప్రోత్సాహకాలను కేంద్రం బాబు చొరవతో మంజూరు చేస్తుందని చాలా మంది ఉన్నత తరగతి ప్రజలు ఆశిస్తున్నారు.ఇక మధ్యతరగతి వర్గాలు చూస్తే పన్నులు తగ్గించాలని తమ పైన భారాలు మోపకుండా చూడాలని వారు కోరుకుంటున్నారు. చెత్త పన్ను రద్దు చేయాలని పెరిగిన విద్యుత్ ఇంటి పన్నులు తగ్గించాలని వారి కోరికగా ఉంది. అలాగే పరిశ్రమలు ఏర్పాటు చేయడం ద్వారా తమ బిడ్డలకు ఉపాధి మార్గాలని చూపించాలని వారు కోరుకుంటున్నారు. నిత్యావసర వస్తువుల ధరలు తగ్గించాలని కూడా మధ్యతరగతి డిమాండ్ గా ఉంది.ఇలా అన్ని వర్గాల ప్రజలు గంపెడాశలు పెట్టుకున్నారు. ఏపీని అన్ని విధాలుగా అభివృద్ధి చేస్తే ఆ ఫలాలు తాము అందుకోవాలని వారు ఆలోచిస్తున్నారు. అయితే ఏపీ పుట్టెడు కష్టాలలో ఉంది. ఈ పేద రాష్ట్రానికి చంద్రబాబు సీఎం అయ్యారు. అన్ని వర్గాల సంక్షేమం చూడడం రాష్ట్ర పెద్దగా బాబుకు తప్పనిసరి.ఆయన విశేష అనుభవంతో చేయగలరనే అంతా అంటున్నారు. అదే సమయంలో పరిస్థితులు కూడా అనుకూలించాలని అంటున్నారు. ప్రజల ఆకాంక్షలు చూస్తే చాలా పై స్థాయిలో ఉన్నాయి. మరి వాటిని బాబు సాకారం చేయడం అంటే అల్లా ఉద్దీన్ అద్భుత దీపం ఏదీ చేతిలో లేదు. అందువల్ల బాబుకు టైం ఇవ్వాల్సి ఉంటుంది. బాబు ఒక్కోటి సాధించుకుని రాగలరు అని అంతా నమ్ముతున్నారు. దీంతో వివిధ వర్గాల ప్రజల్లో కొత్త ప్రభుత్వంపై భారీ అంచనాలను బాబు ఏ స్థాయిలో సంతృప్తి పరచగలరన్నది రానున్న రోజులు తేల్చనున్నాయి.

## అక్షర సత్యాలు- ఆణిముత్యాలు




నిలకడ లేని మనసులు
నీతి తప్పిన మనుషులు
వాస్తవంగా వ్యర్థము
తెచ్చిపెట్టు అనర్థము
గుండె నిండా కలతలు
నెమ్మది లేని బ్రతుకులు
కోకొల్లలు జగతిలో
గగన కుసుమం ప్రగతిలో
సభ్యత లేని వ్యక్తులు
సఖ్యత లేని గృహములు
అమావాస్య చీకట్లు
పొరుగువారికి ఇక్కట్లు
మనసున రాగద్వేషాలు
బ్రతుకున విషతుల్యాలు
విడిచిపెడితే మంచిది
బహుమానమే గొప్పది

**-గద్వాల సోమన్న**
9966414580

## చటకాయ గ్రామంలో కామినేని గెలుపుపై విజయోత్సవ సభ.

సభను ఉద్దేశించి మాట్లాడుతున్న భళే యేసురాజు.



**కైకలూరు జూన్ 17 (వార్తా ప్రభ)** ఈరోజు కైకలూరు నియోజకవర్గం, కైకలూరు మండలం, చటకాయా గ్రామంలో ఎన్ డి ఏ కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా గ్రామాల్లో విజయోత్సవ ర్యాలీ అనంతరం జరిగింది. ఈ కార్యక్రమంలో కొల్లేరు ముద్దుబిడ్డ కైకలూరు నియోజకవర్గం కో కన్వీనర్ భళే యేసు రాజు, తెలుగుదేశం పార్టీ మండల పార్టీ అధ్యక్షులు త్రినాథ్ రాజు, మండవల్లి జడ్పిటిసి మల్లికార్జున్ రావు, ముదునూరి లింగరాజు, పూల రాజి, జయమంగళ సుబ్బరాజు, నుచ్చిమిల్లి ఏసు రాజు, నబిగారి రాంబాబు, వంశీ, సైదు ఏడుకొండలు, స్థానిక చటాకాయ గ్రామ సర్పంచ్ శేషారావు, ఎంపీటీసీ రాఘవేంద్రరావు, వైస్ ప్రెసిడెంట్ సుబ్బరాజు, పార్టీ నాయకులు, కార్యకర్తలు,అభిమానులు పాల్గొన్నారు.



# ముఖ్యమంత్రిని కలిసి అభినందనలు తెలిపిన లోక్ సత్తా నాయకుడు

### పరిపాలనా అంశాలపై వత్తిడిలోనూ అందరికీ కలిసే అవకాశం ఇస్తున్న సి ఎమ్ చంద్రబాబు నాయుడు



**విజయవాడ పశ్చిమ జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి)**ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుని క్యాంపు కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి ఎన్నికల్లో కూటమి ఘనవిజయం సాదించినందుకు లోక్ సత్తా నాయకుడు, సామాజిక కార్యకర్త తూనుగుంట్ల ఫణీంద్ర సి ఎమ్ చంద్రబాబు నాయుడు కి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబుతో ఫణీంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ ప్రజలు మీ పై ఉంచిన నమ్మకంతో రాజకీయ కక్షసాధింపు చేయకుండా గత ప్రభుత్వం చేసిన తప్పిదాలను సరిచేస్తూ కేంద్ర ప్రభుత్వంలో కూడా మీ బలం మరింత అవసరం కాబట్టి ఫెడరల్ వ్యవస్థకి విఘాతం కలగకుండా రాష్ట్రానికి నిధులు తీసుకువస్తు నవ్యాంధ్ర నిర్మాణానికి అడుగులు వేస్తూ అభివృద్ధి, సంక్షేమం రెండు సమపాలిలో ముందుకు తీసుకువెళ్లాలని ముఖ్యమంత్రిని లోక్సత్త నాయకుడు, ప్రముఖ సామాజిక కార్యకర్త తూనుగుంట్ల కోరారు. అదేసమయంలో ఫణీంద్ర మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ లో కూటమికి విజ్ఞతతో ప్రజలు ఓటు వేశారని, ప్రజల ఆశయాలకు అనుగుణంగా కూటమి ప్రభుత్వం పనిచేయాలని ఆయన ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు సామజిక కార్యకర్తలు పాల్గొన్నారు.

# టాస్ 'ని ఆవిష్కరించిన రాహుల్ ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా అండ్ సూర్య కుమార్ యాదవ్



**నెల్లూరు,జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**సన్ఫీస్ట్ ఇప్పీతమ ఇన్స్టాగ్రామ్లో తమతాజా ప్రచారంఇప్పీ టాస్'గురించి వెల్లడించింది.ప్రచారం గురించి ఐటిసి లిమిటెడ్ స్నాక్స్, నూడుల్స్అండ్ పాస్తా, ఫుడ్ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కవితా చతుర్వేదిమాట్లాడుతూ సన్ఫీస్ట్ ఇప్పీ సన్ ఫీస్ట్ నుండి ప్రముఖ ఇన్స్టంట్ నూడిల్అండ్ పాస్తా బ్రాండ్, దేశంలో ఎక్కువ మంది ఇష్టపడే క్రికెటర్లు –రాహుల్ ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా సూర్య కుమార్ యాదవ్ల తో తీర్చిదిద్దిన సరికొత్త ప్రచారంతో ఇది తిరిగి వచ్చిందన్నారు. ఈ వినోదభరితమైన ప్రచారం తోక్రికెట్ ఉత్సాహం తారాస్థాయి చేరుకుందన్నారు.జస్ప్రీత్ బుమ్రాఅండ్ సూర్య కుమార్ యాదవ్ తమ ఇన్స్టాగ్రామ్ హ్యాండిల్స్లో 'ది టాస్' గురించి పంచుకున్న పోస్ట్ల వెనుక రహస్యంహా తెలుసుకోవాలనే ఆసక్తితో ఇప్పటివరకు ఇంటర్నెట్ లో ఆసక్తి నెలకొంది అన్నారు. ఆటగాళ్ల పోస్ట్ ల వెనుక అర్థం తెలియక సతమతమైన అభిమానుల ఆసక్తిని మరింత పెంచుతూ,ఇతరులు కూడా దీనిపై వైరల్ చేశారన్నారు. ఈ నూతన ప్రచారంలో రాహుల్ ద్రావిడ్ ప్రారంభించారన్నారు. ఐటీసి సన్ ఫీస్ట్ ఇప్పి నూతన టీవీసి అందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు.

# పోలవరం డ్యాం సందర్శనలో చంద్రబాబుకు అభినందనలు తెలిపిన రాష్ట్ర టి.డి.పి రైతు సంఘాల నేతలు



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** పశ్చిమగోదావరి జిల్లా పోలవరం ప్రాజెక్టును సందర్శించడానికి సోమవారం ఉదయం పోలవరం ప్రాజెక్టుకు విచ్చేసిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ను పోలవరం ద్యాంమ్ దిగ్విజయంగా పూర్తి కావాలని కృష్ణాజిల్లా హనుమాన్ జంక్షన్ లోని ప్రఖ్యాత అభయాంజనేయ స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి తీసుకువచ్చిన స్వామి వారి శేష వస్త్రాన్ని రాష్ట్ర టిడిపి నేత, సాగునీటి వినియోగదారుల సంఘాల సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు, నరసాపురం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి,గోదావరి పశ్చిమ డెల్టా ప్రాజెక్ట్ కమిటీ మాజీ చైర్మన్ పొత్తూరి రామాంజనేయరాజు,రాష్ట్ర తెలుగు రైతు కార్యనిర్వాహక కార్యదర్శి గుండపనేని ఉమా వరప్రసాద్ కార్యదర్శి వేములపల్లి శ్రీనివాసరావు తదితరులు కలిసి ఇచ్చి పుష్పగుచ్చంతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆళ్ళ వెంకట గోపాల కృష్ణారావు పోలవరం ప్రాజెక్టు నుంచి మాట్లాడుతూ...ఈనెల 12వ తేదీన ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన చంద్రబాబు 13 వ తారీకు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టి 17వ తేదీన పోలవరం డ్యామ్ ను సందర్శించి, సమీక్ష చేసి గత ప్రభుత్వంలో గతితప్పిన పోలవరం ప్రాజెక్టును గాడిలో పెట్టడం ఆంధ్ర ప్రదేశ్ లోని యావత్ రైతాంగం ఆనందించాల్సిన విషయం అన్నారు. రాబోయే కాలంలో నారా చంద్రబాబు నాయుడు దశ దిశ నిర్దేశంతో జల వనరుల శాఖ మంత్రివర్యులు డాక్టర్ నిమ్మల రామానాయుడు ఆధ్వర్యంలో పోలవరం ప్రాజెక్టు 45.72 మీటర్ల ఎత్తులో 194 టీఎంసీల పూర్తి సామర్థ్యంతో 960 మెగా వాట్ల విద్యుత్ ఉత్పత్తిలో త్వరితగతిన పూర్తి అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అట్లాగే పోలవరం ప్రాజెక్టుతో 7 లక్షల ఎకరాల కొత్త ఆయకట్టు,50 లక్షల ఆయకట్టు స్థిరీకరణ,900 గ్రామాలకు త్రాగునీరు,విశాఖపట్నం పారిశ్రామిక అవసరాలకు 24 టీఎంసీల నీరు అందుతుందని ఆనందం వ్యక్తం చేశారు. దీనికి ముందు పోలవరం అతిథి గృహంలో రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రివర్యులు నిమ్మల రామానాయుడు ను రాష్ట్ర టీడీపీ రైతు సంఘాల నేతలు కలిసి పుష్పగుచ్చం ఇచ్చి అభినందనలు తెలియజేశారు.

# బక్రీద్ సందర్భంగా ముఖ్యమంత్రిని కలిసిన ముస్లిం సోదరులు

■ దివ్య ఖురాన్ బహుకరించిన ముస్లిం సంక్షేమ సంఘం రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ కరీముల్లా



**ఇబ్రహీంపట్నం జూన్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):–**బక్రీద్ పండగ సందర్భంగా ముస్లిం సోదరులతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. అందులో భాగంగా ముస్లిం సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ చైర్మన్ ఎన్టీఆర్ జిల్లా ఇన్చార్జి షేక్ కరీముల్లా ముఖ్యమంత్రిని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ముస్లిం సోదరుల పవిత్ర గ్రంథమైన దివ్యఖురాన్ ను ఆయనకు బహుకరించారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి ముస్లిం సోదరులతో త్యాగానికి ప్రతిక అయినా బక్రీద్ సందర్భంగా అందరికి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం ఎప్పుడు కట్టుబడి ఉంటుందని, వారికి పండుగ సమయాలలో రావాల్సిన తోఫాలను సైతం గత ప్రభుత్వం విస్మరించిందని, తప్పకుండా అన్ని విధాలుగా అండగా ఉంటామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ముస్లిం సంక్షేమ సంఘం ఆంధ్రప్రదేశ్ అధ్యక్షులు, ఇతర సభ్యులు ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# త్యాగనిరతికి బక్రీద్ పండుగ నిదర్శనం

### ప్రత్యేక ప్రార్థనలో పాల్గొన్న ఎమ్మెల్యే పులివర్తి నాని

**చంద్రగిరి : జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**చంద్రగిరి నియోజకవర్గ వ్యాప్తంగా బక్రీద్ పర్వదిన వేడుకలు ముస్లిం మైనారిటీ పెద్దల ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. బక్రీద్ పర్వదిన వేడుకల్లో భాగంగా తిరుపతి రూరల్ మండలం, మంగళం పంచాయతీ, బీటీఆర్ కాలనీ మజీద్ లో జరిగిన ప్రత్యేక ప్రార్థనల్లో ఎమ్మెల్యే పులివర్తి నాని పాల్గొన్నారు. ఎమ్మెల్యేగా గెలిచిన తర్వాత మొదటి పండుగ బక్రీద్ అని పులివర్తి నాని పేర్కొన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహెూన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ బక్రీద్ పండుగను జరుపుకుంటున్నారన్నారు. త్యాగ నిరతికి బక్రీద్ పండుగ నిదర్శనమని అన్నారు.



ధనిక, పేద అన్న తారతమ్యం లేకుండా రాగద్వేషాలకు అతీతంగా మైనారిటీలందరూ భక్తిశ్రద్ధలతో ఈ పండుగను జరుపుకుంటున్నట్లు తెలిపారు. ప్రతి ఒక్కరూ దాన గుణం, సేవాగుణం అలవర్చుకోవాలని చెప్పారు. పండుగ సందర్భంగా ముస్లిం సోదరులు ఒకరికొకరు శుభాకాంక్షలు తెలుపుకుంటూ, బంధుమిత్రులతో సంతోషంగా ఉండాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

# రాజకీయ అరంగ్రేటం తొలి అడుగులోనే అఖండ విజయం మీకే సొంతం

■ ఎమ్ పి కేశినేని శివనాధ్ (చిన్ని) కి అభినందనలు తెలిపిన ఫతావుల్లాహ్



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాజకీయ రంగంలో అరంగ్రేటం చేసిన తొలి అడుగులోనే అఖండ విజయం సాధించి రికార్డు సృష్టించిన విజయవాడ ఎమ్ పి కేశినేని శివనాధ్( చిన్ని ) ఇంకా ఇంకా అభినందనలు అందుకొంటూనే వున్నారు. ఆయన పెళ్ళి రోజు సందర్భంగావిజయవాడ పార్లమెంట్ సభ్యులు కేశినేని శివనాద్ చిన్ని కి హైదరాబాద్ లోని ఆయన నివాసం లో కలిసి మైనారిటీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మొహమ్మద్ ఫతాఉల్లాహ్ తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు షేక్ ఆషా లు... ఎమ్ పి గా అఖండ విజయం సాధించినందుకు, మరియు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలిపారు.

# మోడల్ స్కూలుకు మౌలిక సదుపాయాల రూపకల్పనకు చర్యలు

■ అధికారులను ఆదేశించిన డాక్టర్ ఉగ్ర



**కనిగిరి జూన్ 17 వార్తా ప్రభ ప్రతినిధి** కనిగిరి పట్టణంలోని మోడల్ స్కూలుకు రోడ్డు నిర్మాణం త్వరితగతిన చేపట్టాలని అధికారులను కనిగిరి శాసనసభ్యులు డాక్టర్ ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి ఆదేశించారు. సోమవారం సాయంత్రం డాక్టర్ ఉగ్ర పట్టణంలోని మోడల్ స్కూలును పరిశీలించి మౌలిక వసతులపై పర్యవేక్షించారు. అదేవిధంగా గార్ల పేట రోడ్డు నుంచి శంఖవరం మీదుగా కందుకూరు వరకు రోడ్డు నిర్మాణం ఏర్పాటు చేసేందుకు అధికారులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కనిగిరి మండల పార్టీ అధ్యక్షులు తమ్మనేని శ్రీనివాసులు రెడ్డి, షేక్ ఫిరోజ్ తదితర నాయకులు అధికారులు పాల్గొన్నారు.

# ఆదూరుపల్లి ఈద్గాముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు



**చేజర్ల జూన్ 17 (వార్తాప్రభ)** బక్రీదు పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని సోమవారం ఆదూరుపల్లి ఈద్గాలో ముస్లిం సోదరులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.మౌలానా మహబూబాషా ఆధ్వర్యంలో బక్రీద్ పండుగ ప్రత్యేకతను వివరించారు.బక్రీద్ పండుగను ఇబ్రహీం ప్రవక్త అల్లాహ్ ఆదేశానుసారం తన కుమారుడిని బలి ఇవ్వడానికి సిద్దపడ్డాడని చివరి క్షణంలో తన కుమారుడి స్థానంలో ఒక పొట్టేలును అల్లాహ్ ఉంచుతాడని దానికి గుర్తుగా బక్రీదు పర్వదినాన్ని జరుపుకుంటామని ప్రతి వ్యక్తి తన జీవితాన్ని అల్లాహ్ ఆదేశానుసారం జీవిస్తే ఇహ లోకంలోనూ పరలోకంలోనూ సంతోషంగా ఉంటారని ప్రతిరోజు ఐదు పూట్ల నమాజు స్థాపించాలని పేదవారికి సహాయం చేస్తూ జీవించాలని తెలిపారు.ప్రత్యేక ప్రార్థనలో ఆదూరుపల్లి గ్రామంలోని ముస్లిం సోదరులు పాల్గొన్నారు.

# భక్తిశ్రద్ధలతో బక్రీద్ జరుపుకున్న ముస్లిం సోదరులు



**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):–** బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు సోమవారం అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మండల పరిధిలోని ఇబ్రహీంపట్నం, కొండపల్లి, గుంటుపల్లి, ఈలప్రోలు, కేతనకొండ, కాచవరం, దాములూరు మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఒకరినొకరు ఆలింగనం చేసుకుని బక్రీద్ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. గ్రామాల్లో మేకలను ఖుర్బానీ ఇచ్చారు. మూడు భాగాలు చేసి ఒక భాగం సొంతానికి, మరో భాగం బంధువులకు, ఇంకో భాగం పేదలకు పంచిపెట్టారు. కొండపల్లిలో జరిగిన ప్రార్థనల్లో హజరత్ సయ్యద్ షా బుఖారి బాబా దర్గా పీఠాధిపతి అల్తాఫ్ బాబా మాట్లాడుతూ త్యాగానికి ప్రతీక బక్రీద్ అన్నారు. అందరూ సోదరభావంతో ఐకమత్యంగా జీవించాలని సూచించారు. మహమ్మద్ ప్రవక్త ఇబ్రహీం మహెూన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ జరుపుకునే పండుగ బక్రీద్ అన్నారు. బక్రీద్ సమానత్వాన్ని, సోదర భావాన్ని పెంపొందిస్తుందన్నారు.

# ప్రజా సమస్యలపై 37 వ,డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ జానకిరామ్ స్పందన

### ఒక్క ఫోన్ కాల్ తోనే మూత్రశాలను శుభ్రం చేసిన వైనం



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ పశ్చిమ నియోజకవర్గ పరిధిలోని 37 వ డివిజన్ శానిటరీ ఇన్స్పెక్టర్ జానకి రామ్ సోమవారం ఒక్క ఫోన్ కాల్ తోనే మూత్రశాలను శుభ్రం చేసి స్థానికుల ఇబ్బందులు తొలిగించారు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం కాళేశ్వరరావు మార్కెట్ సెంటర్ లోని హెడ్ పోస్టాపపీస్ వెనుక ఉన్న పబ్లిక్ మూత్రశాల విపరీతంగా దుర్గంధం వస్తుంది. పశ్చిమ నియోజకవర్గ



పరిధిలోనే ముఖ్యమైన వ్యాపార కూడలైన ఈ ప్రాంతంలో వినియోగదారుల సౌలభ్యం కోసం మున్సిపల్ కార్పోరేషన్ అధికారులు పబ్లిక్ మూత్రశాలను నిర్మాణం చేపట్టారు. కాలక్రమంలో అది శిధిలావస్థకు చేరినా దానికి అభివృద్ధి పనులు చేపట్టలేదు. రాను రాను వినియోగదారుల అటు వెళ్లాలంటే ఆ దుర్గంధం కి భయపడుతున్నారు. ఇదే అంశాన్ని తెలియజేన్తూ సోమవారం స్థానికులు స్థానిక శానిటరీ ఇన్స్పెక్టర్ జానకిరామ్ దృష్టికి ఫోన్ ద్వారా వివరించారు. దానికి వెంటనే స్పందించిన ఆయన తన సిబ్బందిని పురమాయించి యుద్ధ ప్రాతిపదికన అక్కడ శుభ్రం చేయించారు. దుర్గంధం రాకుండా బ్లీచింగ్ పౌడర్ చల్లించారు. ఈ విషయంపై స్థానికులు శానిటరీ ఇన్స్పెక్టర్ జానకిరామ్ కి కృతజ్ఞతలు తెలిపారు.

# రామోజీరావు ....తెలుగు జర్నలిజాన్ని ఒక మలుపు తిప్పిన సంపాదకుడు

### నివాళులర్పించిన ఎం.పి కేశినేని శివనాథ్ (చిన్ని)

### రామోజీరావు కుటుంబ సభ్యులను పరామర్శించిన చిన్ని





**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రామోజీ గ్రూపు సంస్థల ఛైర్మన్ రామోజీరావు ....తెలుగునాట ఈనాడు దినపత్రికను స్థాపించి.. తెలుగు పత్రికా రంగాన్ని మలుపు తిప్పిన సంపాదకుడు చెరుకూరి రామోజీరావు అని విజయవాడ ఎంపి కేశినేని శివనాథ్ (చిన్ని) స్మరించుకున్నారు. తెలుగుప్రజల్లో దినపత్రికల పట్ల ఆసక్తిని, అభిరుచులను పెంపొందించడంలో రామోజీరావు విశేషమైన కృషి చేశాడని కొనియాడారు. సోమవారం రామోజీ ఫిల్మ్‌సిటీలోని రామోజీరావు నివాసానికి వెళ్లారు. ఇటీవల దివంగతులైన రామోజీరావు చిత్ర పటం వద్ద కేశినేని శివ నాథ్ నివాళులర్పించారు. రామోజీరావు తనయుడు ఈనాడు ఎండి కిరణ్ తో పాటు ఇతర కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. రామోజీరావు లేని లోటు పత్రికా రంగానికే కాదు, తెలుగు సాంస్కృతిక రంగానికి తీరని వెలితిగా భావిస్తున్నట్లు కేశినేని శివనాథ్ తెలియపర్చారు.

## బెజవాడ కనకదుర్గమ్మ సన్నిధిలో రాష్ట్ర స్త్రీ శిశు సంక్షేమ శాఖ,గిరిజన శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానము, ఇంద్రకీలాద్రిపై సోమవారం శ్రీ కనకదుర్గ అమ్మవారి దర్శనార్థం ఆలయమునకు కుటుంబసభ్యులతో కలసి విచ్చేసిన రాష్ట్ర స్త్రీ, శిశు సంక్షేమ, గిరిజన శాఖ మంత్రి శ్రీమతి గుమ్మడి సంధ్యా రాణి కి ఆలయ అధికారులు ఘన స్వాగతం పలికారు. వీరికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికిన ఆలయ ఈ ఓ కే ఎస్ రామారావు, శ్రీ అమ్మవారి దర్శనం కల్పించారు. శ్రీ అమ్మవారి దర్శనానంతరం వీరికి వేదపండితులు, అర్చకులు వేదాశీర్వచనం చేయగా, ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రములు, చిత్రపటం అందజేశారు ...

## రామనారాయణ గుడిలో ప్రసాద వితరణ



**రౌతులపూడి, జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** విజయనగరం అసోసియేషన్ ఆఫ్ అలయన్స్ క్లబ్స్ ఇంటర్నేషనల్ రౌతులపూడి రెస్పాండెడ్ హార్ట్స్ క్లబ్ ఆధ్వర్యంలో ఈనెల 13న గాలి అఖిల సంజన పుట్టినరోజు పురస్కరించుకుని విజయనగరం జిల్లా విజయనగరం పట్టణం రామనారాయణ గుడిలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం అధ్యక్షులు డా.సన్యాసి పాత్రుడు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో [redacted]

# సమస్యల వలయంలో ఆర్టీసీ కాలనీ

**జగ్గయ్యపేట జూన్ 17 (వార్తప్రభ)**పట్టణం ఆర్టీసీ కాలని లో ప్రజలు సమస్యల వలయంలో కొట్టుమిట్టాడుతున్నారు. ఆర్టీసీ కాలనీలో తెలుగుదేశం పార్టీ సానుభూతిపరులు ఎక్కువ ఉన్నారని గత వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఎటువంటి అభివృద్ధి పనులు చేపట్టకపోగా కనీసం వారి సమస్యలను కూడా తీర్చలేదు. తమ కష్టాలు తీర్చే తెలుగుదేశం పార్టీ అధికారం లోకి వచ్చిందని తమ కష్టాలు తీరుతాయని ఆర్టీసీ కాలనీ వాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

**వెలగని విధి లైట్లు** ఆర్టీసీ కాలనీలోని సుమారు 25 నుంచి 30 వీధిలైట్లు వెలగడం లేదు వాటిలో కొన్ని ఆరు నెలల పైగా వెలగడం లేదని ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి కాలనీలోని అన్ని వీధిలైట్లు వెలిగేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ కాలనీవాసులు కోరుతున్నారు.

**వెంటాడుతున్న విద్యుత్ సమస్య** కాలనీ వాసులకు విద్యుత్ పెద్ద తలనొప్పిగా మారింది. ఏ కాలమైనా తాము లో వోల్టేజ్ సమస్యతో బాధపడుతున్నామని. దీనివల్ల విలువైన విద్యుత్ పరికరాలు దెబ్బతినే అవకాశం ఉందని మొరపెట్టుకున్న విద్యుత్ అధికారులు స్పందించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మరియు కాలనీలో పోస్ట్ మాన్ ముకుందరావు ఇంటి వద్ద నుండి వేపల వాగు వరకు ఒక విద్యుత్ స్తంభం ఏర్పాటు చేయాలని కోరినా ఫలితం లేదని. రాత్రిపూట పాముల లాంటి విషపూరితమైన వాటి మధ్య తిరగాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా విద్యుత్ అధికారులు స్పందించి లోవోల్టేజ్ సమస్యను పరిష్కరించి అవసరమైన చోట విద్యుత్ స్తంభాలు ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

**సరఫరా కాని మున్సిపల్ నీరు** కాలనీలో సగానికి పైగా గృహాలకు మున్సిపల్ వాటర్ సరఫరా కావడం లేదు. కొంతమందికి గృహాలకు పంపు కనెక్షన్లు లేకపోయినా బిల్లులు చెల్లించాలని మున్సిపాలిటీ వారు నోటీసులు ఇస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు మున్సిపల్ చైర్మన్, అధికారులు



తెలియజేసినా స్పందన లేదని. వెంటనే స్పందించి కాలనీ మొత్తానికి మున్సిపల్ వాటర్ సరఫరా అయ్యేలా చర్యలు తీసుకొని. పంపు కనెక్షన్లు లేకుండా వేసిన బిల్లు రద్దు చేయాలని వారు కోరుతున్నారు.

**ప్రధానంగా ఇళ్ళపట్టాల సమస్య** కాలనీలో అనేక మందికి ఇళ్ల పట్టాలు లేవని 2014-2019 మధ్య కాలం లో తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో అప్పుటి స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య ఆధ్వర్యంలో రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ఇళ్ల పట్టాలకు చర్యలు తీసుకున్నప్పటికీ. ఎన్నికలు సమీపించడంతో తర్వాత గెలిచిన వైఎస్ఆర్సిపి ప్రభుత్వం ఇళ్ల పట్టాల ఫైల్ మూలన పడేసిందని. ప్రస్తుత శాసనసభ్యులు శ్రీరాం తాతయ్య చర్యలు తీసుకొని తమకు ఇళ్ల పట్టాలు వచ్చేలా చేయాలని మరియు కాలనీలో చాలామందికి టిడ్కో ఇల్లు మంజూరయ్యాయని అవి కూడా త్వరితగతిన తమకు అందేలా చేస్తే శ్రీరాం తాతయ్య కి జీవితకాలం రుణపడి ఉంటామని కాలనీవాసులు తెలియజేస్తున్నారు.

**మున్సిపల్ ఆమోదం పొందినా నిర్మాణం కానీ సిమెంట్ రోడ్డు**

ఆర్టీసీ కాలనీలోని ఉమ్మడిశెట్టి సాంబశివరావు ఇంటి వద్ద నుండి యాటగిరి నాగరాజు ఇంటి వరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం కోసం సుమారు సంవత్సరం క్రితమే మున్సిపల్ కౌన్సిల్లో ఆమోదం పొందింది. అయినప్పటికీ నెలలు గడుస్తున్నా ఇంతవరకు సిమెంట్ రోడ్డు నిర్మాణం మొదలు పెట్టకపోవడానికి కారణాలు తమకు తెలియడం లేదని . మంజూరైన సిమెంట్ రోడ్డు నిర్మాణం చేయకపోవడంపై స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**నిరుపయోగంగా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్** ఆర్టీసీ కాలనీలోని పార్కు కోసం కేటాయించిన మున్సిపల్ స్థలంలో నిబంధనలకు విరుద్ధంగా 70 లక్షలతో స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ నిర్మించారు. ఆరు నెలల క్రితం గత ప్రభుత్వం హడావుడిగా అట్టహాసంగా ప్రారంభించిన స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ఎందుకు పనికి రాకుండా నిరుపయోగంగా పడి ఉంది. దీన్ని వెంటనే ఉపయోగకరంగా చేయాలని స్థానికులు కోరుతున్నారు.

# ఆపరేషన్ డీసిల్టింగ్ లో భాగంగా శరవేగంగా జరుగుతున్న డీసిల్టింగ్ పనులు



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** వర్షపు నీరు రోడ్లమీద నిలవకుండా ఉండేందుకు మొదలుపెట్టిన ఆపరేషన్ డీసెల్టింగ్ లో భాగంగా సోమవారం విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, ఆదేశాల మేరకు విజయవాడ నగర పాలక సంస్థ పరిధిలో డీసిల్టింగ్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్కిల్ వన్ పరిధిలో సివిఆర్ ఫ్లై ఓవర్, ఎలక్ట్రిక్ లోకోమోటివ్ షేడ్ దగ్గర, సితార నుండి కబేల వరకు, క్రాంబే రోడ్, ఎన్ హెచ్ 65 ఆర్టీసీ వర్క్ షాప్ రోడ్ నుండి వెంకటేశ్వర ఫౌండ్రీ రోడ్ వరకు, జీరో బల్బ్ ఏరియా, జండా చెట్టు, సుబ్రహ్మణ్యం స్ట్రీట్ దగ్గరున్న డ్రైన్ లలో డీ సిల్టింగ్ పనులను చేశారు. సర్కిల్ 2 పరిధిలో రామవరప్పాడు ఫ్లైఓవర్ దగ్గర నుండి ఎం పి ఎల్ ఎంప్లాయిస్ గుణదల హౌరా రైల్వే ట్రాక్ దగ్గర, ముస్తాబాద్ దగ్గర ఐ ఆర్ ఆర్ ,వాంబే కాలనీ హెచ్ బ్లాక్, న్యూ రాజరాజేశ్వరి పేట రైల్వే ట్రాక్ ఉన్న డ్రైన్ లాలో జెసిబి లతో డి సిల్టింగ్ చేశారు. సర్కిల్ 3 పరిధిలో ఉన్న బెంజ్ సర్కిల్ ట్రెండ్ సెట్ మాల్ దగ్గర నుండిరాజధాని టీ స్టాల్ వరకు, హెచ్డిఎఫ్సి బ్యాంకు దగ్గర నుండి స్వీట్ మ్యాజిక్ వరకు ఉన్న డ్రైన్స్ నుండి డిసిల్టింగ్ చేశారు. వర్షపు నీరు రోడ్డు మీద నిలవకుండా డ్రైన్ లలో ఎటువంటి ఆటంకాలు లేకుండా వర్షపు నీరు ప్రవహించేటట్టుగా విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ చేస్తున్న ఆపరేషన్ డీసిల్టింగ్ శరవేగంగా జరుగుతున్నట్లు తెలిపారు.



# వంతెన మరమ్మత్తులు వెంటనే ప్రారంభించండి-ఎమ్మెల్యే కామినేని



**కలిదిండి జూన్ 17 (వార్తా ప్రభ)** ఏలూరుజిల్లా, కైకలూరు నియోజకవర్గం, కలిదిండి మండలం, పోతుమర్రు మరియు తాడినాడ గ్రామాల ప్రధాన రహదారి లో వంతెన కూలిపోయిందని తెలుసుకున్న కైకలూరు శాసనసభ్యులు డా. కామినేని శ్రీనివాస్ పడిన వంతెన పరిశీలించి,సంబంధిత సెక్రటరీ ప్రధ్యుమ్న ని వెంటనే వంతెన మరమ్మత్తుల పనులు ప్రారంభించాలని ప్రజలకు ఇబ్బంది కలగకుండా వెంటనే వంతెన నిర్మాణం చేపట్టాలని మాజీ మంత్రి కైకలూరు నియోజకవర్గం శాసనసభ్యులు కామినేని శ్రీనివాస్ ఆదేశాలు జారీ చేశారు.

# మంత్రి ని కలిసిన ఎపి ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వెల్ఫేర్ అసోసియేషన్



**ఇబ్రహీంపట్నం జూన్ 17(వార్తా ప్రభ ప్రతినిధి):-** రాష్ట్ర మంత్రి గొట్టిపాటి రవికుమార్ ని ఆంధ్రప్రదేశ్ ఎస్సీ,ఎస్టీ విద్యుత్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు ఆదివారం నాడు చిలకలూరిపేట ఆయన నివాసంలో మర్యాద పూర్వకంగా కలిశారు. నూతన విద్యుత్ శాఖా మంత్రిగా భాద్యతలు స్వీకరించనున్న ఆయనకు పుష్ప గుత్యాలను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సమస్యలు పరిష్కరించాలని కోరారు. కార్యక్రమంలో అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు శివకుమార్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఏ.వి.కిరణ్, సెంట్రల్ పవర్ డిస్ట్రిబ్యూషన్ ప్రధాన కార్యదర్శి వసంతరావు, ఏపి జెన్కో అధ్యక్షుడు కళ్యాణ్ కుమార్, లైజన్ ఆఫీసర్ నారాయణ, స్థానికి అసోసియేషన్ అధ్యక్షుడు ఉమా విజయ్ చంద్, ఆఫీసు బేరర్లు కాంతారావు, మనోహర్, కుమార స్వామి, మణి బాబు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

# దస్తావేజు లేఖరులకు గుర్తింపు కార్డులు

**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):-** దస్తావేజు లేఖరుల వృత్తి పరిరక్షణ సమితి ఎన్టీఆర్ జిల్లా కార్యవర్గ సమావేశం ఇబ్రహీంపట్నంలోని జిల్లా కోశాధికారి కొమ్మూరు వెంకటేశ్వరరావు నాయుడు కార్యాలయంలో సోమవారం జరిగింది. సమావేశానికి జిల్లాలోని 10 కార్యాలయాల నుంచి ప్రతినిధులైన కార్యవర్గ సభ్యులు హాజరయ్యారు. అసోసియేషన్ సభ్యత్వాలపై చర్చించారు. జిల్లా నుంచి మొత్తం 325 సభ్యత్వాలు వచ్చాయి. దీనికి సంబంధించి సభ్యత్వ రశీదులు, సభ్యులకు ఐడెంటిటి కార్డులు మంజూరు చేసి ప్రతినిధులకు అందజేశారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.



# భగవద్ రామానుజ గోష్టి ఆధర్యంలో నిరుపేదలకు దుప్పట్లు పంపిణీ

### పేదలకు దుప్పట్లు అందజేస్తున్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య, శ్రీరాం సిద్దు లు



**జగ్గయ్యపేట జూన్ 17 (వార్తప్రభ)**భగవద్ రామానుజ గోష్టి ఆధర్యంలో నిరుపేదలకు దుప్పట్ల పంపిణీ కార్యక్రమంలో జగ్గయ్యపేట శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య ముఖ్య అతిథిగా పాల్గొని దుప్పట్ల పేదలకు అందించారు. సోమవారం పట్టణంలోని పురాతన దేవాలయమైన శ్రీ భూ గోదా సమేత చెన్నకేశవ స్వామి వారి ఆలయ ఆవరణలో ఏకాదశి పర్వదిన సందర్భంగా గర్భాలయంలోని స్వామి అమ్మవార్లకు పంచామృత అభిషేకాలు అనంతరం స్వామి అమ్మ వాళ్లకు నూతన వస్త్రాలతో తీర్చిదిద్ది వివిధ పరిమళభరిత పుష్పమాలలతో అలంకరించి కర్పూర హారతులు ఇచ్చారు. ఈ విశేష అభిషేకాలు పూజాది కార్యక్రమాలలో జగ్గయ్యపేట ఎమ్మెల్యే శ్రీరాం తాతయ్య , శ్రీరాం సిద్దు లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా భగవద్ రామానుజ గోష్టి ఆధ్వర్యంలో ఆలయ ఆవరణలో జరిగిన పేదలకు దుప్పట్లు పంపిణీ లో తాతయ్య, పాల్గొని వృద్ధులకు పేదలకు దుప్పట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీరాం సిద్దు, భగవత్ రామానుజ గోష్టి ప్రతినిధులు ఆకల స్వాతి కుమార్ విజయ దంపతులు, వార్డు కౌన్సిలర్ గొట్టే నాగరాజు ,చెన్నకేశవ స్వామి వారి భక్త బృందం, విశేష సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు

# బెజవాడ కనకదుర్గమ్మ కి బంగారు నత్తు బహుకరణ



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రిపై సోమవారం విజయవాడకు చెందిన పి.రాజ్ కుమార్, మరియు కుటుంబ సభ్యులు శ్రీ అమ్మవారికి అలంకరణ నిమిత్తం కానుకగా 27 గ్రాములు బరువు గల బంగారు నత్తును ఆలయ అధికారులను కలిసి దేవస్థానమునకు అందజేశారు. ఆలయ అధికారులు దాత కుటుంబమునకు శ్రీ అమ్మవారి దర్శనము కల్పించగా, వేదపండితులు వేదాశీర్వచనం చేయగా ఆలయ అధికారులు శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు.



# అడుగడుగునా జన నీరాజనం

**గుత్తి జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**రాష్ట్రానికి మంత్రినైనా అనంతపురం జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కూలీగా పని చేస్తానని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ పేర్కొన్నారు. రాష్ట్ర మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసి జిల్లా సరిహద్దులైన గుత్తి మండలంలోని సుంకులమ్మ గుడి వద్దకు ఆర్థిక శాఖ మంత్రి చేరుకున్నారు. సుంకులమ్మ గుడి వద్ద మంత్రికి అనంతపురం పార్లమెంట్ సభ్యులు అంబికా లక్ష్మీనారాయణ, జిల్లా ఎమ్మెల్యేలు ఘన స్వాగతం పలికారు.

# ఎమ్మెల్యే కామినేని నివాసం వద్ద కూటమి విజయోత్సవాలు.

### గెలుపులో పాత్ర వహించిన నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదములు – కామినేని.



**కైకలూరు జూన్ 17 (వార్తా ప్రభ)** ఈరోజు కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు డాక్టర్ కామినేని శ్రీనివాసరావు గెలుపుతో పాటు వారి మెజార్టీతో వచ్చిన సందర్భంగా కైకలూరు నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, కామినేని శ్రీనివాస్ అభిమానులు వరాహాపట్నంలోని శాసనసభ్యులు కామినేని నివాసం వద్ద పండుగ వాతావరణం, సందడి వాతావరణం నెలకొంది. అభిమానులు పూలగుచ్చాలతో, నోటు పుస్తకాలతో, కామినేని శ్రీనివాస్ కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గెలుపులో పాత్ర వహించిన నియోజకవర్గం ప్రజలందరికీ కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# డాక్టర్ టి. జనార్దన్ కు ఘన సన్మానం – ఆత్మీయుల అభినందన



**తిరుపతి జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** సీనియర్ జర్నలిస్టు, కమ్యూనిస్టు నేత సేవా తత్పరుడు, బహుముఖ ప్రజ్ఞాశాలి తూపల్లె జనార్ధన్ కు ఇటీవల ఎస్ వి యూనివర్సిటీ డాక్టరేట్ ప్రధానం చేసిన నేపథ్యంలో తిరుపతిలోని సీనియర్ జర్నలిస్టులు, శ్రేయోభిలాషులు సోమవారం స్థానిక సిపిఐ కార్యాలయంలోని గ్రంథాలయంలో ఆయనకు ఘన సన్మానం చేశారు. సీనియర్ జర్నలిస్టు గుండ్రాజు సుకుమార్ రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డాక్టర్ జనార్ధన్ ఆత్మీయ స్నేహితులు, సన్నిహితులు హాజరై అభినందనలు తెలియజేశారు. సుదీర్ఘకాలం తర్వాత డాక్టరేట్ పొందడం ఆయన పట్టుదలకు నిదర్శనమని,అనుకున్నది సాధించాలనే తపన ఆయనకే సాధ్యమని పలువురు కొనియాడారు. జర్నలిస్టు నాయకుడిగా, కమ్యునిస్టు పార్టీ నేతగా అందరికీ అందుబాటులో ఉంటూ సేవే లక్ష్యంగా ప్రేమాభిమానాలు పంచుతూ అందరివాడిలా మెలుగుతూ కీర్తి ప్రతిష్టతలు సంపాదించారని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డా. పి.కృష్ణమూర్తి , ఎపియుడబ్ల్యుజె అధ్యక్షులు డా .ప్రసాద్, జర్నలిస్టు నేతలు ఆలూరు గిరిధర్ ,నరేందర్ రెడ్డి ఆదిమూలం శేఖర్, లక్ష్మీపతి చెంగల్ రాయులు, రామకృష్ణారెడ్డి,చంద్రశేఖర్, చాంబర్ ఆఫ్ కామర్స్ మాజీ అధ్యక్షులు ఎం. మంజునాథ్ చిత్తూరు సిపిఐ కార్యదర్శ యస్. నాగరాజు తదితరులు డాక్టర్ జనార్ధన్ అకుంఠిత దీక్షతో సాధించిన డాక్టరేట్ పట్ల హర్షం వ్యక్తం చేస్తూ శాలువా కప్పి హృదయపూర్వక అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా సన్మాన గ్రహీత డాక్టర్ టి. జనార్ధన్ మాట్లాడుతూ విద్యను అభ్యసించేందుకు వయస్సు కొలమానం కాదని,విద్యతో ఎన్నో పనులను సుసాధ్యం చేసి ప్రగతి చెందవచ్చునని పేర్కొన్నారు.కార్యక్రమానికి విచ్చేసిన సన్నిహితులకు కృతజ్ఞతలు తెలిపారు. తాను పి హెచ్ డి పూర్తిచేసేందు కు సహకరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేశారు. భవిష్యత్తులో న్యాయవాది వృత్తిని చేపట్టాలని లక్ష్యంతో ఎల్ ఎల్ బి ని పూర్తి చేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పలువురు జర్నలిస్టులు, చిత్తూరు నగర సిపిఐ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా చంద్రగిరి నియోజకవర్గ ఎమ్మెల్యే నాని సతీమణి సుధా రెడ్డి డాక్టర్ టి.జనార్ధన్ ను ప్రత్యేకంగా అభినందించారు.

# బంగారు పథకంకు రూ 1 లక్షా 11 వేల 116 లు విరాళము అందజేత



**విజయవాడ పశ్చిమ జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)**శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం, ఇంద్రకీలాద్రి పై కబేలా ఇండస్ట్రియల్ ఏరియా, ఆర్ ఆర్ నగర్, విజయవాడకు చెందిన యేగ్గిన లక్ష్మి కాంతారావు మరియు కుటుంబసభ్యులు రూ.1,11,116/-ల ను విరాళంగా శ్రీ అమ్మవారి ఆలయం స్వర్ణ తాపడం పనుల నిమిత్తం ఆలయ కార్యనిర్వాహనాధికారి కె ఎస్ రామరావు ని సోమవారం కలిసి అందజేశారు. ఆలయ అధికారులు వీరికి కనక దుర్గమ్మ అమ్మవారి దర్శనం కల్పించి, వేదపండితులచే వేదాశీర్వచనం కల్పించగా, ఈవో శ్రీ అమ్మవారి ప్రసాదములు, శేష వస్త్రం మరియు చిత్రపటం అందజేశారు.

# వాసవి క్లబ్ సేవలు తొర్రూర్ పట్టణంలో అభినందనీయం

**తొర్రూర్ జూన్ 17 (వార్తా ప్రభ)**వాసవి క్లబ్ సేవలు తొర్రూరు పట్టణ కేంద్రంలో అభినందనీయమని,వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ శ్రీనివాస అన్నారు. వాసవి క్లబ్ ఆధ్వర్యంలో ఆర్యవైశ్యులు చేస్తున్న సేవలు ప్రపంచ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుంది అని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ మల్టిపుల్ ట్రెజరర్ శ్రీనాథ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూర్ డివిజన్ కేంద్రంలో డాన్ టు డస్క్. సూర్యోదయం నుండి సూర్యాస్తమయం వరకు నిర్వహించిన సేవా కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు మొదట వాసవి మాత ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి 20 కుర్చీల ను ఆలయానికి వితరణ చేపట్టారు పట్టణంలోని ప్రభుత్వ బాలికల



పాఠశాలలో గాంధీ విగ్రహ ఆవిష్కరణ. వీధి వ్యాపారులకు పదిమందికి గొడుగుల వితరణ . చిరు వ్యాపారులకు 5 గురికీ తోపుడుబండ్ల వితరణ. పోలీసులకు టవల్స్. మాస్కులు పంపిణీ. 10 మంది వృద్ధులకు చేతి కర్రల పంపిణీ తాము మరణించిన అనంతరం ఆర్గాన్ డొనేట్ చేసేవారి నుండి పత్రాల సేకరణ. గోశాలలో దానవితరణ ప్రభుత్వ పాఠశాలలకు వాటర్ ట్యాంక్ లో వితరణ సేవ కార్యక్రమాలు చేపట్టారు సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవా కార్యక్రమాలు ఇంటర్నేషనల్ స్థాయిలో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. ఆర్యవైశ్యులు సేవే పరమావధిగా సేవ చేయడం అభినందన ఏమని కొనియాడారు ఈ ప్రాంతంలో ఉండే వారికి స్థానికులు సేవ చేస్తే ఎంతో గుర్తింపు ఉంటుందని ప్రతి ఒక్కరు సేవ చేయడం అలవర్చుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ ట్రెజరర్ ఉమ్మడవెల్లి నారాయణ కే సి ఎఫ్ గోల్డెన్ రీజియన్ చైర్ పర్సన్. పొద్దుటూరి గౌరీ శంకర్. వాసవి క్లబ్ తొర్రూరు అధ్యక్షులు బిజ్జాల అనిల్ కుమార్. కార్యదర్శి చౌడవరపు రాము కోశాధికారి వల్లపు మధు వాసవి వనిత క్లబ్ అధ్యక్షులు దారం గాయత్రి. వాసవి సరస్వతి క్లబ్ అధ్యక్షుడు మచ్చ సోమయ్య. వాసవి సిల్వర్ స్టార్ అధ్యక్షులు మచ్చ సురేష్. వాసవి చత్రపతి శివాజీ యూత్ అధ్యక్షులు సాయి తేజ. వాసవి క్లబుల్స్ అధ్యక్షులు లింగమూర్తి. క్లబ్ సభ్యులు. రామ్మూర్తి. చిదురాల రవి చిదర మహేష్ ఉమ్మడి రాంబాబు మంచినీళ్ళ నవీన్. అఖిల్ నిఖిల్ వాసవి క్లబ్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే కామినేని నివాసం వద్ద కూటమి విజయోత్సవాలు

### గెలుపులో పాత్ర వహించిన నియోజకవర్గ ప్రజలందరికీ ధన్యవాదములు– కామినేని.



**కైకలూరు జూన్ 17 (వార్తా ప్రభ)** ఈరోజు కైకలూరు నియోజకవర్గ శాసనసభ్యులు మాజీ మంత్రివర్యులు డాక్టర్ కామినేని శ్రీనివాసరావు గెలుపుతో పాటు వారి మెజార్టీతో వచ్చిన సందర్భంగా కైకలూరు నియోజకవర్గం కూటమి నాయకులు, కార్యకర్తలు, కామినేని శ్రీనివాస్ అభిమానులు వరాహాపట్నంలోని శాసనసభ్యులు కామినేని నివాసం వద్ద పండుగ వాతావరణం, సందడి వాతావరణం నెలకొంది.



అభిమానులు పూలగుచ్చాలతో, నోటు పుస్తకాలతో, కామినేని శ్రీనివాస్ కు అభినందనలు, శుభాకాంక్షలు తెలియజేశారు. మాజీ మంత్రి కైకలూరు శాసనసభ్యులు కామినేని శ్రీనివాసరావు మాట్లాడుతూ గెలుపులో పాత్ర వహించిన నియోజకవర్గం ప్రజలందరికీ కార్యకర్తలకు, అభిమానులకు పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

# మంత్రి ఆనం ను కలిసిన చేజర్ల టిడిపి నాయకులు



**చేజర్ల జూన్ 17 (వార్తాప్రభ)** దేవాదాయ శాఖ మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డిని నెల్లూరు ఆయన నివాసంలో చేజర్ల మండలం ముస్లిం మైనార్టీ తెలుగుదేశం పార్టీ నాయకులు షేక్ సిరాజుద్దీన్ చేజర్ల ఆర్యవైశ్య మండల అధ్యక్షులు పువ్వాడీ శ్రీనివాసరావు చేజర్ల మండలం సొసైటీ అధ్యక్షులు భూదల్ల వీర రాఘవరెడ్డి చేజర్ల మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ దళిత నాయకులు సోమవరపు హజరత్తయ్య తిమ్మాయిపాలెం ముస్లిం మైనార్టీ టిడిపి నాయకులు సయ్యద్ షుకుర్ తదితరులు పాల్గొని మంత్రివర్యులు ఆనం రామనారాయణ రెడ్డికి దేవదాయ శాఖ పదవి ఇవ్వడంపై హర్షం వ్యక్తం చేస్తూ పూల బొకేలతో శాలువాలతో ఘనంగా అభినందనలు తెలియజేశారు. మండల ముస్లిం మైనారిటీ టిడిపి నాయకులు షేక్ సిరాజ్ మాట్లాడుతూ మంత్రిగా ఎన్నికవ్వడం మాకు చాలా ఆనందంగా ఉందని పేర్కొన్నారు. ఆత్మకూరు నియోజకవర్గం ప్రజలకు అభివృద్ధి చేయడంలో ముందుండి అనేక కార్యక్రమాలు ఆయన ద్వారా జరుగుతాయని సంతోషం వ్యక్తం చేశారు. త్వరలోనే పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టే దిశగా ఆయన అడుగులు ముందుకు వేస్తున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్య మండల అధ్యక్షులు పువ్వాడ శ్రీనివాసులు నెల్లూరు కిమ్స్ హాస్పిటల్ డైరెక్టర్ తాళ్లూరు గిరినాయుడుని కలిసి టిడిపి పార్టీ అధికారంలోకి వచ్చినందుకు శుభాకాంక్షలు తెలియజేశారు



అలాగే ఆనం రామనారాయణ రెడ్డి ఆత్మకూరు నియోజకవర్గంలో గెలుపొందేందుకు తాళ్లూరు గిరి నాయుడు ఎనలేని కృషి చేశారని అందుకు సంతోషం వ్యక్తం చేస్తున్నామని తెలిపారు.



ఆంధ్రప్రదేశ్ బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు స్వీకరించిన సవిత కు శుభాకాంక్షలు తెలుపుతున్న బీసీ సంఘం నాయకులు దూళ్ల హరిబాబు యాదవ్ **–వార్తా ప్రభ, గుంటూరు**

# సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి

*– గర్భిణీ స్త్రీలు, షుగర్ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించాలి*

*– పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెంట్ డా. సుజాత*



**పిఠాపురం జూన్ 17 :(వార్తా ప్రభ ప్రతినిధి)** : వేడి వాతావరణం నుంచి చల్లని వాతావరణంలోకి మారుతున్న దృష్ట్యా ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని పిఠాపురం ప్రభుత్వాసుపత్రి సూపరింటెంట్ ( ప్రధాన వైద్యాధికారి ) డా. సుజాత అన్నారు. వాతావరణంలో మార్పులు ఏర్పడి కాలం మారుతున్న వేళ సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, డయేరియా వంటి వ్యాధులు ప్రబలే అవకాశం ఉందని, వాంతులు విరోచనాలు వంటివి రోజుల తరబడి అవుతుంటే అశ్రద్ధ చేయవద్దని కోరారు. సీజనల్ వ్యాధులు అనగా డయోరియా వంటి లక్షణాలు కనిపిస్తే... ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం చేయించుకోవాలని, పిఠాపురం ప్రభుత్వ ఆసుపత్రిలో సీజనల్ వ్యాధులకు అన్ని రకాల మందులు అందుబాటులలో ఉన్నాయని అన్నారు. ముఖ్యంగా గర్భిణీ స్త్రీలు, షుగర్ వ్యాధిగ్రస్తులు తగు జాగ్రత్తలు పాటించాలని, వాంతులు విరోచనాలు అంటే డయేరియా లక్షణాలు కనిపిస్తే... సొంత వైద్యం మానుకోవాలని, బయట వ్యక్తులను సంప్రదించి వైద్యం చేయించుకోవడం మంచిది కాదని, వెంటనే వైద్యులను సంప్రదించి, వైద్యుల సూచన మేరకే తగిన వైద్యం పొందాలని డాక్టర్ సుజాత సూచించారు.

# కేంద్ర మంత్రులకు శుభాకాంక్షలు తెలియజేసిన వేణుగోపాల్ యాదవ్



**కూకట్ పల్లి, జూన్ 17 (వార్తాప్రభ):** భారత ప్రధాని నరేంద్ర మోడీ, కేంద్ర హెూం మంత్రి అమిత్ షా ఆశీస్సులతో,కేంద్ర మంత్రివర్గంలో మంత్రులుగా తెలంగాణ నుండి బాధ్యతలు తీసుకున్న నాయకులు కిషన్ రెడ్డి ని,బండి సంజయ్ ని ఢిల్లీ లోని వారి మినిస్టర్ కార్యాలయాలలో కలిసి శాలువాతో సన్మానించి పుష్పగుచ్ఛం అందజేసి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేయడం జరిగింది. ఈ సందర్భంగా మేడ్చల్ అర్బన్ జిల్లా అధికార ప్రతినిధి చల్లా వేణుగోపాల్ యాదవ్, మాట్లాడుతూ రాబోయే రోజులలో మరింత ఉన్నత పదవులు పొంది ప్రజలకు మరింత సేవ చేయాలని అన్నారు.

# ఢిల్లీలో శిక్షణ తరగతులకు ఇబ్రహీంపట్నం ఎంపీపీ జ్యోత్స్న ఎంపిక



**ఇబ్రహీంపట్నం, జూన్ 17 (వార్తా ప్రభ ప్రతినిధి):–** ఢిల్లీలోని నీతి అయోగ్ ఆధ్వర్యంలో ఇండియన్ ఇన్ స్టిట్యూట్ ఆఫ్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ లో ఈ నెల 20, 21 తేదీల్లో జరగనున్న శిక్షణ తరగతులకు ఇబ్రహీంపట్నం ఎంపీపీ పాలడుగు జ్యోత్స్న ఎంపికయ్యారు. ఈ మేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు సీఎంవో సెక్రటరీ గిరిజా శంకర్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి ఎంపీపీ పాలడుగు జ్యోత్స్నకు అరుదైన గౌరవం దక్కింది. రెండు రోజుల పాటు శిక్షణ తరగతులకు హాజరయ్యే ఎంపీపీ ఆ విషయాలను రాష్ట్రంలో తెలియజేయనున్నారు. తనపై నమ్మకం ఉంచి శిక్షణ తరగతులకు ఆంధ్రప్రదేశ్ నుంచి ఎంపిక చేయడం పట్ల ఎంపీపీ జ్యోత్స్న ముఖ్యమంత్రి చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

# పేటలో బక్రీద్ పండుగ ప్రత్యేక ప్రార్థనలు



**అనుమసముద్రంపేట జూన్ 17 (వార్తాప్రభ)** మండల కేంద్రంలో ఉన్న ఖాజా నాయబ్ రసూల్ దర్గాలో బక్రీదు పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని దర్గా ఈవో హుస్సేన్ ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. దర్గా మసీద్ వద్ద నమాజ్ చదివే భక్తులకు షామియానాలు తాగునీరు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.అలాగే మండలంలో పలు ఈద్గా మసీదులో ముస్లిం సోదరులు మౌలానాలా ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు చేశారు.అనంతరం ప్రతి వ్యక్తి తన జీవితాన్ని అల్లాహ్ ఆదేశానుసారం జీవిస్తే సంతోషంగా ఉంటారని అన్నారు.అలాగే పేదవారికి సహాయం చేస్తూ జీవించాలని తెలిపారు.ఈ కార్యక్రమంలో దర్గా ఈవో 2 షేక్ షరీఫ్ మత పెద్దలు ముస్లిం సోదరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుంది

### -ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన కాంగ్రెస్ ఇంచార్జ్ జగదీశ్వర్ గౌడ్



**శేరిలింగంపల్లి,జూన్ 17 (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ముస్లింల అభ్యున్నతికి ఎనలేని కృషి చేస్తుందని శేరిలింగంపల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ వి.జగదీశ్వర్ గౌడ్ అన్నారు.పవిత్ర బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకుని మాదాపూర్ డివిజన్ పరిధిలోని ఆదిత్య నగర్ ఈద్గా నందు నిర్వహించిన ప్రార్థనలో పాల్గొని ప్రజలకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా జగదీశ్వర్ గౌడ్ మాట్లాడుతూ..స్వరాష్ట్రంలో పేద ముస్లింలకు సంక్షేమ ఫలాలు అందుతున్నాయని,అన్ని కులాలు,మతాలను సమానభావంతో చూస్తున్న సెక్యులర్ నాయకుడు సీఎం ఏ.రేవంత్ రెడ్డి అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో నియోజకవర్గ నాయకులు ఏకే బాలరాజ,కృష్ణ ముదిరాజ్,వీరందేర్ గౌడ్,మహిపాల్ యాదవ్,మన్నెపల్లి సాంబశివరావు,కట్ల శేఖర్ రెడ్డి,యూత్ కాంగ్రెస్ అధ్యక్షులు సౌందర్య రాజన్,పోచయ్య,నితిన్,లక్ష్మణ,మునఫ్ ఖాన్,హమీద్,రహీం,హనీఫ్,ఖాజా,ముషారఫ్ తదితరులు పాల్గొన్నారు..

## ఎంపీ తంగెళ్ల ఉదయ్ కు శుభాకాంక్షలు తెలిపిన డా.మల్లాడి



**కాకినాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** కాకినాడ పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికైన శుభ సందర్భంగా ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసినట్లు కాకినాడ పార్లమెంట్ ఎన్నికల కమిటీ సభ్యులు డా.మల్లాడి రాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాకినాడ పార్లమెంటు చరిత్రలోనే అత్యధిక మెజార్టీతో గెలిచిన తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ ను అభినందించినట్లు మల్లాడి తెలిపారు. అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ఆశీస్సులతో చిన్న వయసులోనే పార్లమెంట్ సభ్యునిగా ఎన్నికయి రికార్డు సృష్టించడమే కాకుండా రాబోవు రోజుల్లో కాకినాడ పార్లమెంటుని అభివృద్ధి పదాన నడిపించి , యువతకు ఆదర్శప్రాయునిగా ఉదయ్ శ్రీనివాస్ ఉండబోతున్నారని మల్లాడి రాజేంద్ర తెలిపారు. ఈ కార్యక్రమంలో 20వ డివిజన్ జనసేన ఇంచార్జి బస్వానీ నాగబాబు, 16వ డివిజన్ జనసేన ఇంచార్జి వరిపిల్లి ప్రసాద్, 19వ డివిజన్ తెలుగుదేశం ఇంచార్జి చింతపల్లి తాతారావు,గంపల సత్యానందం,సంగాని బాలమహేశ్వరరావు, వీరెల్లి ఏసు, మామిడికుదురు ప్రసాద్, పొట్టి పెద్ద బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఇది నా మాతృభూమి ఇక్కడ గాలి అంటే ఎంతో ఇష్టం

● మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజీ



**విసన్నపేట,జూన్ 17 (వార్తాప్రభ) :** స్థానిక మండల కేంద్రంలో తాను జన్మించానని ఇది నా మాతృభూమి అని ఇక్కడి గాలి వాతావరణం నాకు ఎంతో ఇష్టమని నాకు రాజకీయ ఓనమాలు దిద్దించిన గురువు కీర్తిశేషులు డాక్టర్ వీరభద్రరావు ఇంటిలో నేడు మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఉండటం గుండె నిండాఆనందాన్ని ఇస్తుందని రాష్ట్ర బిజెపి మైనారిటీ మోర్చా అధ్యక్షులు షేక్ బాజీ అన్నారు. దేశంలో ఎన్ డి ఏ ప్రభుత్వ పరిపాలన నరేంద్ర మోడీ జీ సారాధ్యంలో అత్యున్నత స్థాయికి వెళుతుందన్నారు. బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు. విజనరీ మరియు అనుభవం ఉన్న సీనియర్ నాయకులు తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్ర రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రివర్యులు కొణిదెల పవన్ కళ్యాణ్, రాష్ట్ర బిజెపి అధ్యక్షురాలు దగ్గుబాటి పురందరేశ్వరిల సారధ్యంలో రాష్ట్ర ప్రజలు ఆర్థికంగా ఎదుగుతారన్నారు. ఇదే గ్రామంలో గ్రామ కార్యకర్తగా ఓనమాలు దిద్దిన నేను మండల స్థాయి జిల్లా స్థాయి నుండి అత్యున్నత స్థాయికి ఎదిగేందుకు పునాది కులమత రాజకీయాలకు అతీతంగా ఆనాడు స్థానికంగా నాకు విసన్నపేట పాత తాలూకా విస్సన్నపేట చాట్రాయి ప్రస్తుత మండలంలోని కోటపాడు గ్రామంలో ఆనాటి రామాలయ నిర్మాణం నకు సహకరించిన గ్రామస్తులు రెడ్డిగూడెం మండలంలోని గ్రామాల పెద్దలు ప్రజానీకం స్నేహం అభిమానం ఆత్మీయత మరువలేనిది అన్నారు. బాధలు కష్టాలు ఉన్న ప్రభుత్వం నుండి ఆనందం సుఖం పొందే ఎన్డీఏ ప్రభుత్వంలోకి అడుగు పెట్టామన్నారు. అందరూ బాగుండాలి వారి ఆనందంలో వారి మధ్యన మనము పాలుపంచుకుంటూ ఉండాలని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో తిరువూరు నియోజకవర్గ బిజెపి కన్వీనర్ పెనుగొండ రామచంద్రరావు బాజీకి సన్మాన కార్యక్రమంలో భాగంగా పట్టు శాలువా సుగంధ పరిమళాలు వెదజల్లే పూలదండను ఆయన మెడలో వేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి పోలే శాంతి, విసన్నపేట మండల పార్టీ అధ్యక్షురాలు తోకల సుమ శంకర్, ఎస్సీ మోర్చా ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేడ కమలాకర్, కార్యదర్శి తోకల శంకర్, ఎస్సీ మోర్చా నాయకులు కొక్కరిగడ్డ నాగరాజు, ఆర్యవైశ్య ప్రముఖులు గంగిశెట్టి మధు, కిసాన్ మోర్చా ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి తాళ్ల వెంకట శ్రీనివాసరావు, కార్యదర్శి కొంగర రామారావు, కిసాన్ మోర్చా మండల అధ్యక్షులు అబ్బినేని చంద్రశేఖర్ (బాబు), ఓ బి సి జిల్లా కార్యదర్శి పిల్లి యలమందరావు, మండల అధ్యక్షులు గ్రంధి వెంకటేశ్వరరావు, ఏ కొండూరు మండల ప్రధాన కార్యదర్శి కంకట శ్రీనివాసరావు, ఏ కొండూరు ఎస్టి మోర్చా మండల అధ్యక్షులు బణావతు గాంధీ, ఏ కొండూరు మండల ఓబీసీ అధ్యక్షులు నాగ సురేంద్రనాథ్ తదితరులు పాల్గొన్నారు. ముస్లిం సామాజిక వర్గానికి చెందిన విజయ విలాస్ పాన్ షాప్ అధినేత నబి కుటుంబాన్ని బాజీ పరామర్శించారు.

## ముస్లిం సోదరులకు దేశాయ్ గురు రాజ్ బక్రీద్ శుభాకాంక్షలు



**నందవరం,జూన్ 17 (వార్తాప్రభ) :** నందవరం మండలం నందవరం గ్రామంలో సోమవారం రోజున ముస్లింల బక్రీద్ పండుగ పురస్కరించుకొని నందవరం గ్రామంలో గల ఈద్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు ముస్లిం సోదరులు భక్తిశ్రద్ధలతో ఈద్గాలో ప్రార్థనలు నిర్వహించినారు హిందూ ముస్లిం భాయ్ భాయ్ లాగా ఉండి శాంతిని నెలకొల్పే విధంగా ఉండాలని వారు ప్రార్థన నిర్వహించారు ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు దేశాయ్ గురురాజ్ ముస్లిం మత పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## రోటరీ వైద్య శిబిరానికి విశేష స్పందన



**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** డా॥ పెరుమాళ్ళు దంపతుల జ్ఞాపకార్థం వారి కుమార్తె డా॥ చలసాని లలిత ఆధ్వర్యాన రోటరీ పర్యవేక్షణలో పామర్రు రోడ్ లోని పెరుమాళ్ళు గార్డెన్స్‌లో ఆదివారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన వచ్చింది. డా॥ పిన్నమనేని సిద్ధార్థ మెడికల్ సైన్సెస్, పెద అవుటపల్లి వైద్యులు సిబ్బంది సేవలు అందించారు. అవసరమైన వారికి ఉచితంగా ఇసిజి ఎకో బ్లడ్ టెస్ట్ బిపి పరీక్షలు చేశారు. మందులు ఉచితంగా అందజేశారు. ఈ వైద్య శిబిరాన్ని రోటరీ పూర్వ అధ్యక్షులు ప్రముఖ నేత్ర వైద్య నిపుణులు డా॥ పొట్లూరి విశ్వేశ్వరరావు మరో రోటరీ పూర్వ నేత డా॥ సి సూర్యచంద్రరావులు ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిరుపేదలకు కార్పోరేట్ వైద్యాన్ని ఉచితంగా అందజేస్తున్న పెరుమాళ్ళు కుటుంబీకులు, ఆయన కుమార్తె డా॥ లలితను ప్రత్యేకంగా అభినందించారు. గుడివాడ ప్రాంత ప్రజానీకం ప్రతి నెలా నిర్వహిస్తున్న ఈ కార్పోరేట్ వైద్య శిబిరాన్ని వినియోగించుకోవాలనీ కోరారు. ఈ కార్యక్రమంలో రోటరీ నేతలు బాబూశ్రీకర్, ముళ్ళపూడి రమణమూర్తి, టివిన్ శేఖర్, గుళ్ళపల్లి కిరణ్‌బాబు, ఎ. సుబ్రహ్మణ్యేశ్వరరావు, పొన్నూరు రామకృష్ణ, జి.నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## కొంటు ముకుందం దంపతులకు బి. సి.నేత "భేరి" శుభాకాంక్షలు



**హైదరాబాద్, జూన్ 17 (వార్తాప్రభ) :** మేడ్చల్ మల్కాజ్ గిరి జిల్లా మేదరి సంఘం అధ్యక్షులు మరియు బిసి ఐక్యవేదిక కార్యదర్శి కొంటు విజయ, కొంటు ముకుందం దంపతులకు పెళ్లిరోజు సందర్భంగా వారికి వివాహ మహోత్సవ శుభాకాంక్షలు తెలంగాణ రాష్ట్రం బీసీ ఐక్యవేదిక అధ్యక్షులు బేరి రామచంద్ర యాదవ్ తెలియ చేశారు. ఈ సందర్భంగా భేరి రామచందర్ యాదవ్ మాట్లాడుతూ దంపతులిద్దరూ నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఆనందంగా జీవించాలని ఆ భగవంతుని వేడుకున్నారు . అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఇంకా మరెన్నో ఉన్నత పదవులు అందిపుచ్చుకోవాలని,మేదరుల పట్ల అంకితభావంతో పనిచేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక నాయకులు పట్లూరి కృష్ణమోహన్, తమ్మ చంద్రమౌళి, ఎం వి ఎస్ నాయక్, ఆల్ ఇండియా చైర్మన్ శ్రీ ఇస్మాయిల్, చేతిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, నోముల ప్రవీణ్ కుమార్, తెలంగాణ రాష్ట్ర బీసీ ఐక్యవేదిక యువ నాయకులు కొంటు సుమన్ మరియు బీసీ నాయకులు పెళ్లిరోజు శుభాకాంక్షలు తెలియజేశారు.

## రాష్ట్ర ప్రజల ఆకాంక్షలు నెరవేరుస్తాం - మంత్రి కొలుసు పార్థసారథి



**హనుమాన్ జంక్షన్,జూన్ 17 (వార్తాప్రభ) :** కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజల ఆకాంక్షల మేరకు రాబోయే రోజుల్లో కష్టపడి పని చేస్తూ వారి కోరికలను నెరవేరుస్తామని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. ఎన్నికల్లో ఘన విజయం సాధించి ఇటీవల మంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన ఆయన ఆదివారం సాయంత్రం హనుమాన్ జంక్షన్ లో కొలువుదీరిన శ్రీ అభయ ఆంజనేయస్వామి వారిని దర్శించుకుని ఆశీస్సులు పొందారు. ఈ క్రమంలో ఆలయ అర్చకులు మంత్రికి స్వామివారి చిత్రపటాన్ని అందించారు. అనంతరం ఆయన ఆలయం వెలుపల పాత్రికేయులతో మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్ర ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు చిత్తశుద్ధితో కృషి చేస్తూ కష్టపడి పనిచేస్తామన్నారు. కూటమికి ఘన విజయాన్ని అందించిన రాష్ట్ర ప్రజలకు ఆయన ఈ సందర్భంగా కృతజ్ఞతలు తెలియజేశారు. తొలుత హనుమాన్ జంక్షన్ లోనికి ప్రవేశించిన మంత్రికి కూటమి పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో బాపులపాడు, పెదపాడు, నూజివీడు మండలాల కూటమి పార్టీ నాయకులు దయాల రాజేశ్వరరావు, చలమలశెట్టి రమేష్ బాబు, వేగిరెడ్డి పాపారావు, అట్లూరి శ్రీనివాసరావు, వేమూరి శ్రీనివాసరావు, మట్టా శ్రీను , సుంకర సుభాష్ చంద్రబోస్ ,నూతక్కి వేణు, అక్కినేని చందు, లింగం కిషోర్, దేవినేని డెలారాO , అట్లూరి రమేష్, తదితరులు పాల్గొన్నారు.



గుడివాడకి చెందిన పాన్ వెండర్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన ఎమ్మెల్యేగా నూతనంగా ఎన్నికైన వెనిగండ్ల రామును సోమవారం ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ అధ్యక్షులు కొనకొళ్ళ సీతయ్య, కార్యదర్శి శంభంగి నీలకంఠం, సమయ మంత్రి సత్యనారాయణ, ఎం. శ్రీనివాసరావు, కోన నాగరాజు, కోన ముత్యాలు, శ్రీను, నాగేంద్ర, వరప్రసాద్, పి. సత్యనారాయణ, డి. అప్పారావు పలువురు యూనియన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

–గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :

## కుటుంబ సభ్యులకు అండగా ఉంటా..

● వైఎస్ఆర్పి ఇన్చార్జి బుట్ట రేణుక



**నందవరం,జూన్ 17 (వార్తాప్రభ) :** నందవరం మండలం కనకవీడు గ్రామ వైఎస్ఆర్సీపీ కార్యకర్త మాల మల్లయ్య వైఎస్ఆర్సీపీ పార్టీ ఓటమిని జీర్ణించుకోలేక గుండెపోటుతో మరణించడం జరిగింది. మాల మల్లయ్య కుటుంబాన్ని పరామర్శించి,ప్రగాఢ సానుభతిని తెలియజేసిన వైఎస్ఆర్సీపీ ఎమ్మిగనూరు ఇంఛార్ బుట్టా రేణుక తనయుడు బుట్టా ప్రతుల్ వారి కుటుంబానికి పార్టీ అండగా ఉంటుమని తెలిపారు. ఈ కార్యమంలో వైఎస్ఆర్సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లక్ష్మీకాంత్ రెడ్డి ,నందవరం మండల కన్వీనర్ శివారెడ్డి గౌడ్ ,నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు వీరుపాక్షి రెడ్డి ,మండల ప్రధాన కార్యదర్శి పేట శ్రీనివాస్ రెడ్డి , మాజీ ఎల్ ఎల్ సి డైరెక్టర్ గడ్డం నారాయణ రెడ్డి ,వేంకటేశ్వర రెడ్డి ,హరి రెడ్డి,మండల నాయకులు, కనకవీడు గ్రామ సర్పంచ్ వెంకట్రాముడు, వైస్ ఎంపీపీ షైక్ అహమ్మద్,ఎంపీటీసీ హరిచంద్ర,మాజీ సర్పంచ్ స్వామి దాసు,మాజీ ఎంపీటీసీ శివన్న, తిక్కన్న గడప మత్తయ్య ఉసేని సత్యరాజు నాయకులు వెంకట్రాముడు,ఈరన్న,పీవెంకట్రాముడు,కార్యకర్తలు, అభిమానులు,తదితరులు పాల్గొన్నారు.

## మానవత శాంతి రథం ప్రారంభించిన దాత తోట వేంకటేశ్వరరావు



**హనుమాన్ జంక్షన్, జూన్ 17 (వార్తాప్రభ) :** దాతలు దానశీలురు అభినందనీయులని మానవత స్వచ్ఛంద సేవా సంస్థ రాష్ట్ర కన్వీనర్ మారుబోయిన కోటేశ్వరరావు అన్నారు. సోమవారం మానవతా హనుమాన్ జంక్షన్ శాఖకు ఉచితంగా సేవలందించే నూతన శాంతి రథం కు తనవంతుగా 2,50, 000 రూపాయలను ఖర్చు చేసిన తోట వేంకటేశ్వరరావు ను మానవత కార్యాలయంలో సభ్యులు సన్మానించారు. మానవత 5 , 50, 000 లక్షల రూపాయలతో శాంతి రథం కోసం కొనుగోలు చేయగా దాత తోట వేంకటేశ్వరరావు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి 2,50, 000 లక్షలు ఖర్చు చేశారన్నారు. సోమవారం శాంతి రథాన్ని తోట కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తోట పూర్ణ, గూడపాటి జయరామచంద్రారావు, పాబోలు గణేష్ బాబు , వేగిరెడ్డి సూర్యనారాయణ, కొట్నాని రామచంద్రరావు, కళ్ళేపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు, జే వి వి సత్యనారాయణ , బెజవాడ శ్రీరామ మూర్తి, రేవిణిశెట్టి సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వానికి మారుపేరు మానవత లక్ష రూపాయలు విరాళం అందించిన డాక్టర్ దుట్టా



**హనుమాన్ జంక్షన్, జూన్ 17 (వార్తాప్రభ) :** మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ హనుమాన్ జంక్షన్ శాఖకు ప్రముఖ డాక్టర్ , సంఘ సేవకులు దుట్టా రామచంద్రరావు లక్ష రూపాయలు విరాళం మానవత రాష్ట్ర కన్వీనర్ మారు బోయిన కోటేశ్వరరావు కు అందించారు. మానవత చేస్తున్న సేవా కార్యక్రమాలకు స్పందించిన డాక్టర్ దుట్టా ఈ విరాళం అందించినట్లు చెప్పారు. ఈ సందర్భంగా డాక్టర్ దట్టా రామచంద్రరావు ను పలువురు అభినందించారు. ఈ ఈ కార్యక్రమంలో వేగిరెడ్డి సూర్యనారాయణ , జన్యావుల సత్యనారాయణ , రేవిణిశెట్టి సూర్య నారాయణ , జయ రామచంద్రరావు , చెక్కా సుబ్బారావు , దయాల ప్రభాకర రావు, కళ్ళేపల్లి నారాయణరావు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా భక్త ప్రవర్త ఆంజనేయ స్వామి కళ్యాణ మహోత్సవం



**కంకిపాడు ,జూన్ 17 (వార్తాప్రభ) :** మండలంలోని కోలవెన్ను గ్రామ శివారు ప్రాంతమైన మాదాసువారి పాలెం లో శ్రీ భక్త ప్రవర్త ఆంజనేయస్వామి సువర్చల దేవి కళ్యాణ మహోత్సవాన్ని కన్నులు పండుగ నిర్వహించారు. ఆంజనేయ స్వామి కళ్యాణ మహోత్సవంలో భాగంగా గ్రామంలోని ఆంజనేయస్వామి దేవాలయాని కొబ్బరి, అరటి మామిడి తోరణాలతో ముస్తాబు చేశారు. ఆంజనేయస్వామి విగ్రహాని వివిధ రకాల పూలమాలలతో అలంకరించారు. శ్రీ సువర్చలాదేవి ఆంజనేయ స్వామి కళ్యాణ మహోత్సవాన్ని దంపతులు చేత భక్తిశ్రద్ధలతో పురోహితులు ఆదివారం సాయంత్రం నిర్వహించారు. మహిళలు, గ్రామస్తులు కళ్యాణ మహోత్సవంలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. సోమవారం ఉదయం ఆలయ కమిటీ నిర్వాహకులు సురేష్ ఆధ్వర్యంలో సుమారు 2000 మందికి అన్నసంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని పెనమలూరు నియోజకవర్గ ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నసంతర్పనలో పాల్గొని స్వయంగా భక్తులకు వడ్డించి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ ఆలయ కమిటీ నిరవహులు తదితరులు పాల్గొన్నారు.

## నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి పాదయాత్ర నిర్వహించిన టీడీపీ నాయకులు



**గిద్దలూరు, జూన్ 17 (వార్తాప్రభ) :** గిద్దలూరు శాసనసభ్యులుగా ముత్తుముల అశోక్ రెడ్డి ఘన విజయం సాధించిన శుభ సందర్భంగా పట్టణంలోని 2వ వార్డు కౌన్సిలర్ బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్ ఆధ్వర్యంలో రాచర్ల మండలం, నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీ నెమలిగుండ్ల రంగనాయక స్వామి వారి ఆలయం వరకు పాదయాత్ర నిర్వహించారు.. మొదటగా పట్టణంలోని శ్రీ వినాయక స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం రాచర్ల గేట్ సెంటర్ లోని శ్రీ పంచముఖి అభయ ఆంజనేయ స్వామి వారి ఆలయంలో టెంకాయలు కొట్టి తమ పాదయాత్రను ప్రారంభించారు.. అంబవరం, వెల్లుపల్లె, జయరాంపురం గ్రామాల మీదుగా పాదయాత్ర కొనసాగించి ఆలయానికి చేరుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి తమ మొక్కును చెల్లించుకున్నారు.. నెమలిగుండ్ల రంగనాయక స్వామి ఆలయానికి చేరుకున్న వారికి గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి అభినందనలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు..

## నాన్నలకి కచ్చితంగా చేయించాల్సిన టెస్టులివే..






**వార్తాప్రభ ఆరోగ్య చిట్కాలు**

ఆరోగ్యం చాలా ముఖ్యమైనది. ముఖ్యంగా మన అందరి బాగోగులని చూసే కన్న తండ్రి ఆరోగ్యంగా ఉన్నాడా లేదా అని తెలుసుకోవడం మరీ ముఖ్యం.తండ్రి.. ఎన్నో బాధ్యతలు నిర్వహిస్తాడు. ఇంట్లోని వారందర్నీ అన్ని విధాలుగా కాపాడే తండ్రి.. అతని ఆరోగ్యంపై నిర్లక్ష్యం వహిస్తాడు. తన జీవితంలో ఎప్పుడు కూడా పిల్లలకి మంచి చదువు, సమాజంలో వారిని ఉన్నతంగా తీర్చిదిద్దాలనే ఆలోచనలతోనే ఉంటాడు. ఇన్ని బాధ్యతలు నిర్వర్తించే తండ్రి గొప్పదనం తెలుసు కాబట్టే, వారికంటూ ఓ రోజుని కేటాయించి ఫాదర్స్ డేగా సెలబ్రేట్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వారి ఆరోగ్యం గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

**ఫాదర్స్ డే..** ఇది ఒక్కో దేశంలో ఒక్కో రోజున జరుపుకుంటారు. ఇండియాలో మాత్రం జూన్ మూడో ఆదివారం జరుపుకుంటారు. ఈ నేపథ్యంలోనే ఈ రోజున వారికంటూ కేటాయించి వారి ఆరోగ్యం గురించి పట్టించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉంది. ఇందులో భాగంగా వారికి కొన్ని హెల్త్ చెకప్స్ చేయించాలి. అవేంటో తెలుసుకోండి.

**హైబీపి..** హైబీపిని సైలెంట్ కిల్లర్ అంటారు. ఎలాంటి లక్షణాలు చూపించకుండానే బాడీలోపల సమస్యల్ని తీసుకొస్తుంది. సాధారణంగా ఏదైనా సమస్య ఉండి హాస్పిటల్‌కి వెళ్ళినప్పుడు ఈ సమస్య గురించి తెలుస్తుంది. దీనికి ట్రీట్‌మెంట్ చేయకుండా అలా వదిలేస్తే స్ట్రోక్స్‌కి దారి తీస్తుంది. నార్మల్ టెస్ట్‌తో బీపి ఉందో లేదో తెలుసుకోవచ్చు. 45 ఏళ్ళ పైబడిన వారు రెగ్యులర్‌గా బ్లడ్ టెస్టులు చేయించుకోవాలి. మీకు గుండె జబ్బులు, ధూమపానం, ఒత్తిడితో వంటి సమస్యలు ఉంటే రెగ్యులర్‌గా బీపిని చెక్ చేసుకోవాలి.

**డయాబెటిస్ టెస్ట్..** ఈ రోజుల్లో షుగర్ సర్వసాధారణం. సరిలేని లైఫ్‌స్టైల్, సరిలేని ఫుడ్, ఒత్తిడి కారణంగా షుగర్ సమస్య వస్తుంది. భారత్‌లో డయాబెటీస్ పెరుగుతుందని నివేదికలు చెబుతున్నాయి. దీని కోసం రెగ్యులర్‌గా షుగర్ టెస్ట్ చేయించుకోవాలి. ట్రీట్‌మెంట్ చేయకుండా వదిలేస్తే డయాబెటిక్ రెటినోపతి, గ్యాంగ్రీన్, అంగస్తంభన, మూత్రపిండాల సమస్యలు పెరుగుతాయి. ఆల్రెడీ కుటుంబంలో ఎవరికైనా సమస్య ఉంటే షుగర్ టెస్ట్ చేయించుకోవడం చాలా ముఖ్యం.

**లిపిడ్ ప్రొఫైల్ టెస్ట్..** ది గుండెపోటు, స్ట్రోక్ ప్రమాదాన్ని సూచిస్తుంది. కొలెస్ట్రాల్ టెస్ట్, హై కొలెస్ట్రాల్, హైబీపి వంటి వాటి గురించి తెలియజేస్తుంది. దీనిని రక్త పరీక్ష ద్వారా చేయొచ్చు. అయితే, ఇది చేసే ముందు 12 గంటల పాటు ఏం తీసుకోకూడదు. 40 ఏళ్ళు దాటిన వారు ప్రతి ఆరు నెలలకోసారి ఈ టెస్ట్ చేయించుకోవాలి.

**ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్, క్యాన్సర్..** ఈ టెస్ట్ చాలా ఇబ్బందిగా ఉంటుంది. కాబట్టి, ఈ టెస్టులు చేయించుకోరు. అయితే,ఈ టెస్టులు ప్రాణాలను కాపాడుతుంది. ప్రొస్టేట్ ఎన్‌లార్జ్‌మెంట్ అనేది మూత్రవిసర్జన, మూత్రనిలుపుదలతో సమస్యల్ని కలిగించే ఓ సాధారణ సమస్య. ఇందుకోసం రెండు రకాల పరీక్షలు చేయించుకోవచ్చు. డిజిటల్ మల పరీక్ష విస్తారిత, అసాధారణమైన ప్రొస్టేట్‌ని బహిర్గతం చేయొచ్చు. %ూూా% పరీక్ష అనేది రక్తంలో ప్రొస్టేట్ నిర్దిష్ట యాంటిజెన్స్‌ని గుర్తించే మరో రకమైన పరీక్ష.

## ఉదయాన్నే ఈ టీ తాగితే బాడీలోని కొలెస్ట్రాల్ తగ్గుతుందట..



నేడు చాలా మంది గుండె సమస్యలతో బాధపడుతున్నారు. దీనికి ము ఖ్య కారణం చెడు కొలెస్ట్రాల్. దీనిని తగ్గించేందుకు బ్లాక్ జింజర్ టీ ఎలా హెల్ప్ చేస్తుందో తెలుసుకోండి.హెల్దీగా ఉన్న వ్యక్తికి గుండె సమస్యలు రావు. దీనికి కారణం అతని లైఫ్‌స్టైల్. చక్కని లైఫ్‌స్టైల్, చెడు అలవాట్ల కారణంగా కొలెస్ట్రాల్ పెరుగుతుంది. మనం తీసుకునే ఆహారం కారణంగా చెడు కొలెస్ట్రాల్, మంచి కొలెస్ట్రాల్ పెరుగుతాయి. మంచి కొలెస్ట్రాల్ గుండెకి మంచిది. చెడు కొలెస్ట్రాల్ ఎక్కువైతే గుండెకి ప్రమాదం. అయితే, ఇలాంటి వాటికి చెక్ పెట్టాలంటే కొన్ని టిప్స్ ఫాలో అవ్వాలి. అందుల్లో బ్లాక్ జింజర్ టీ ఒకటి. దీనిని ఎలా తీసుకోవాలి.. తీసుకుంటే ఎలాంటి లాభాలున్నాయో తెలుసుకోండి.

**బ్లాక్ జింజర్ టీ..** చాలా మందికి జింజర్ టీ గురించి తెలుసు. కానీ, బ్లాక్ జింజర్ టీ గురించి తెలియదు. ఇందులో యాంటీ ఆక్సిడెంట్స్ పుష్కలంగా ఉంటాయి. ఇవి మన శరీరంలోని ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తాయి. అంటే ఫ్రీ రాడికల్ ఎలిమెంట్స్‌తో పోరాడతాయి. ఈ యాంటీ ఆక్సిడెంట్స్ మన శరీర కణాలకు ఎలాంటి హాని జరగకుండా నిరోధించి, వాపుని తగ్గిస్తాయి. దీంతో గుండె ఆరోగ్యాన్ని కాపాడతాయి.

**ఒత్తిడి తగ్గడం..** మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉన్నవారిలో కొలెస్ట్రాల్ లెవల్స్ పెరుగుతాయి. దీని వల్ల గుండె సమస్యలొస్తాయి. అదే మనం బ్లాక్ జింజర్ టీ తాగితే మానసిక ఒత్తిడి తగ్గి బాడీ రిలాక్స్ అవుతుంది.

**లివర్ క్లీన్ అవ్వడం..** ఉదయాన్నే పరగడపున ఖాళీ కడుపుతో నల్ల అల్లం టీ తాగితే మంచిది. ఎందుకంటే, ఇది లివర్ పనితీరుని మెరుగ్గా చేస్తుంది. జీవక్రియ ప్రక్రియని మెరుగ్గా చేసి లివర్‌ని క్లీన్ చేస్తుంది.

కొలెస్ట్రాల్‌ని కంట్రోల్ చేయడానికి కూడా మంచిది.

**బరువు తగ్గడం..** లాక్ జింజర్ టీ తాగితే కొలెస్ట్రాల్ లెవల్స్ కంట్రోల్ అవుతాయి. ఇవి మన జీవక్రియ ప్రక్రియని మెరుగ్గా చేసి ఆకలిని కంట్రోల్ చేస్తాయి. కాబట్టి, కొలెస్ట్రాల్ కంట్రోల్ అవుతుంది.

# ముస్లిం సోదరులకు బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలియజేసిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

- సమస్త జనుల మంచి కోసం చేసే త్యాగాలకు సార్ధకత ఉంటుంది.. త్యాగాల పండుగ బక్రీద్





**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** త్యాగాలకు ప్రతీక అయిన బక్రీద్ సందర్భంగా ముస్లిం సోదరులకు ఎమ్మెల్యే వేనిగండ్ల రాము శుభాకాంక్షలు తెలిపారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలన్నారు. దైవ ప్రవక్త ఇబ్రహీం మహెూన్నత త్యాగాన్ని స్మరించుకుంటూ.. ఈ పండుగ జరుపుకుంటారన్నారు. సమిష్టి ప్రయోజనాల కోసం వ్యక్తిగత స్వార్ధాన్ని వీడి త్యాగాలకు సిద్దపడినప్పుడే సమాజ హితం సాధ్యామవుతుందని, త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్ధకత అనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వ మానవాళికి అందిస్తుందని ఎమ్మెల్యే రాము తెలిపారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తున్నదని అన్నారు. భక్తి భావానికి, విశ్వాసానికి, కరుణ, ఐక్యతకు సంకేతమైన ఈ పండుగను ముస్లిం సోదరులందరూ భక్తి శ్రద్ధలతో ఘనంగా జరుపుకోవాలని ఎమ్మెల్యే రాము ఆకాంక్షిస్తూ.. అల్లా ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని ఆయన అభిలషించారు.

**మసీదుల్లో ప్రత్యేక ప్రార్ధనలు నిర్వహించిన ముస్లింసోదరులు :** బక్రీద్ పర్వదిన సందర్భంగా మసీదుల్లో ప్రత్యేక ప్రార్థన నిర్వహించడం జరిగింది. గుడివాడ నియోజకవర్గ ప్రజలకు బక్రీద్ శుభాకాంక్షలు తెలియజేస్తూ.. అల్లా దయతో ప్రజలందరూ సుఖ సంతోషాలతో సుభిక్షంగా ఉండాలని ముస్లిం సోదరులు ఆకాంక్షించారు. మన దగ్గర ఉన్నదాంట్లో నలుగురికి పరచాలన సూక్తి నీ సర్వ మానవాళికి తెలియజేస్తూ.. అల్లా చేస్తున్న అద్భుత క్రియను స్మరించుకుంటూ ప్రతి సంవత్సరం బక్రీద్ పండుగ ను ఘనంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. చుట్టాలకు, బంధువులకు మరియు లేనివారికి తోచిన విధంగా సహాయం.. ఈ పండుగను ఆనందంగా జరుపుకుంటున్న ముస్లిం సోదరులు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సయ్యద్ జబీన్, మహ్మద్ రఫీ, షేక్ రఫీ, బాజీ, షేక్ ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో మిగులు భూములు భూమిలేని పేదలకు పంచాలి

- రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వరులు డిమాండ్..





**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** గుడ్లవల్లేరు మండల వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ వడ్లమన్నాడు గ్రామంలో సోమవారం జరిగింది. దీనికి గ్రామ అధ్యక్షులు మాదాసు మురళీ కృష్ణ అధ్యక్షత వహించారు. ముఖ్య అతిధిగా పాల్గొన్న రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వరులు మాట్లాడుతూ.. దేశం సంపద సృష్టించేది, దేశ ప్రాజలకు తిండి పెట్టేది వ్యవసాయ కార్మికులెనని అన్నారు. అలాంటి వ్యవసాయ కార్మికులకు ఎలాంటి సంక్షేమ పథకాలు లేవని, అన్నారు. తెలంగాణ మాదిరిగగా వ్యవసాయ కార్మికుల భరోసా అమలు చేయాలని, డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షురాలు వంకాయల పాటి రాణి మాట్లాడుతూ ఉపాధి పనులు పెంచటానికి పోరాటం ఉధృతం చేయాలన్నారు. జిల్లా కార్యదర్శి పవన్ మాట్లాడుతూ ఇదే స్ఫూర్తితో జిల్లాలో నిర్మాణం చేపడతామన్నారు. కౌలు రైతు సంఘం జిల్లా నాయకులు బి.వి. శ్రీనివాసరావు మాట్లాడుతూ.. మండలంలోని 21 గ్రామాలకు సంఘాన్ని విస్తరించి సభ్యత్వాలు చేసి, మండల స్థాయిలో పోరాటం ఉధృతం చేయాలన్నారు. ఐద్వా నాయకురాలు బసవ అరుణ మాట్లాడుతూ పూర్తి మద్దతు ప్రకటించారు. అనంతరం మండల కమిటీ ని ఎన్నుకొన్నారు. మండల అధ్యక్షరాలుగా అరెపల్లి రమాదేవి, కార్యదర్శిగా కటికల యాకోబు, సహాయ కార్యదర్సులుగా, పమర్తి రమాదేవి, మాదాసు మురళీకృష్ణ, ఉపాధ్యక్షులుగా పామర్తి శ్రీరామూర్తి, చిలుముల కృష్ణ, మదిరి నాగరాజు, కోశాధికారిగా దాసి వెంకటేశ్వరరావు, కమిటీ సభ్యులుగా రాజులపాటి శైలజ, మేకల ఏసురత్నం, మోదుగుమూడి శివకీర్తి, జంగం అశ్వని, మన్నెం కుమారి, పాలిటి రత్నారావు, మోదుగుమూడి భాగ్యలక్ష్మి, రేణుకారాజు లను ఎన్నుకొన్నారు.

# ముస్లిం సోదరులకు బక్రీద్ శుభాకాంక్షలు తెలిపిన మాజీ మంత్రి కొడాలి నాని

- ముస్లిం సోదరులందరూ భక్తిశ్రద్ధలతో సంతోషంగా బక్రీద్ వేడుకలు నిర్వహించుకోవాలి



**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** బక్రీద్ పర్వదినం సందర్భంగా ముస్లిం సోదరులకు మాజీ మంత్రి కొడాలి నాని బక్రీద్ పర్వదిన శుభాకాంక్షలు తెలిపారు. సమిష్టి ప్రయోజనాల కోసం వ్యక్తిగత స్వార్ధాన్ని వీడి త్యాగాలకు సిద్దపడినప్పుడే సమాజ హితం సాధ్యామవుతుందని, త్యాగాల ద్వారా ప్రాప్తించిన ప్రయోజనాలు సమస్త జనులకు సమానంగా అందినప్పుడే ఆ త్యాగాలకు సార్ధకత అనే సందేశాన్ని బక్రీద్ పండుగ విశ్వ మానవాళికి అందిస్తుందని కొడాలి నాని తెలిపారు. బక్రీద్ పండుగ భక్తి, త్యాగం, కరుణ, విశ్వాసం అనే గొప్ప గుణాలను ప్రజల్లో పెంపొందిస్తున్నదని అన్నారు. బక్రీద్ పండుగను పురస్కరించుకుని ముస్లిం సోదర, సోదరీమణులకు ఓ ప్రకటన ద్వారా కొడాలి నాని శుభాకాంక్షలు తెలియజేశారు. త్యాగం, సహనం బక్రీద్ పండుగ ఇచ్చే సందేశాలని పేర్కొన్నారు. అల్లా ఆశీస్సులు ప్రజలందరికీ ఎప్పుడూ ఉండాలని కొడాలి నాని ఆకాంక్షించారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌కు స్పెషల్ గిఫ్ట్ ఇచ్చిన మేనల్లుడు సాయిధరమ్ తేజ్

- పవన్‌కు స్టార్ వార్స్ అండ్ లెగో కిట్‌ను గిఫ్ట్‌గా ఇచ్చిన మెగా మేనల్లుడు
- పవన్‌లోని పిల్లాడికి ఈ బహుమతి అన్న సాయిధరమ్ తేజ్
- ఇటీవలే పవన్‌కు పెన్నుని బహుమతిగా ఇచ్చిన చిరంజీవి దంపతులు




ఏపీ డిప్యూటీ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన నాటి నుంచి జనసేన అధినేత పవన్ కళ్యాణ్‌కు అభినందనల వెల్లువ కొనసాగుతోంది. ప్రత్యేకించి కుటుంబ సభ్యులు ఆయన్ను అభినందిస్తున్నారు. బహుమతులతో ముంచెత్తుతున్నారు. ఇటీవలే అన్నావదినలు మెగాస్టార్ చిరంజీవి, సురేఖ ప్రత్యేక పెన్నును బహుమతిగా అందజేశారు. తాజాగా డిప్యూటీ సీఎం మేనల్లుడు సాయి ధరమ్ తేజ్ కూడా స్పెషల్ గిఫ్ట్‌ను అందజేశారు. 'స్టార్ వార్స్ అండ్ లెగో' కిట్‌ను బహుమతిగా అందజేశారు. "స్టార్ వార్స్, లెగోలను నాకు పరిచయం చేసిన వ్యక్తి, నా ప్రియమైన జేడీ మాస్టర్ (స్టార్ వార్ కల్పిత పాత్ర), డిప్యూటీ సీఎంకు ఎట్టకేలకు ఒక బహుమతి ఇచ్చే అవకాశం నాకు వచ్చింది. చిన్ననాటి రోజులను గుర్తుచేసుకుంటూ ఆయనలోని పిల్లాడికి మేనల్లుడు ఇచ్చిన గిఫ్ట్ ఇది. ఫోర్స్ కూడా మాతోనే ఉంటారు" అని ఎక్స్‌లో సాయిధరమ్ తేజ్ రాసుకొచ్చాడు.

# అల్లు అర్జున్ పవన్ మధ్య విభేదాలకు కారణం అతడే..? బయటకొచ్చిన అసలు నిజం



మెగా వర్సెస్ అల్లు అభిమానుల మధ్య పచ్చ గడ్డి వేస్తే భగ్గుమనే పరిస్థితి నెలకొంది. ఇటీవల జరిగిన ఎన్నికల సమయంలో అల్లు అర్జున్ వైసీపీ అభ్యర్థికి మద్దతుగా నిలవడమే దీనికి కారణం. మెగా ఫ్యామిలీ అంతా కూడా పవన్ కళ్యాణ్‌కు అండగా నిలిస్తే..ఒక్క అల్లు అర్జున్ మాత్రం వైసీపీ అభ్యర్థికి తన మద్దతు ప్రకటించారు. నంద్యాల వైసీపీ అభ్యర్థి, తన స్నేహితుడు శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డికి మద్దతు ప్రకటించడమే కాకుండా..అక్కడి వెళ్లి మరీ ప్రచారంలో పాల్గొన్నారు. ఈ ఘటనతో మెగా ఫ్యామిలీ వర్సెస్ అల్లు ఫ్యామిలీ అన్నట్టుగా మారిపోయింది పరిస్థితి. దీని తర్వాత అల్లు అర్జున్ ఉద్దేశించి మెగా బ్రదర్ నాగబాబు ట్విట్టర్ వేదికగా విమర్శలు చేయడం, దానికి బన్ని అభిమానులు ఓ రేంజ్‌లో ఫైర్ అవ్వడం చక చక జరిగిపోయాయి. అల్లు అర్జున్ అభిమానుల దెబ్బకు నాగబాబు ట్విట్టర్ అకౌంట్‌ను కూడా డిలీట్ చేశారు. ఇక ఈ ఎన్నికల్లో కూటమి విజయం సాధించడం..అల్లు అర్జున్ మద్దతు ప్రకటించిన శిల్పా రవిచంద్ర కిశోర్ రెడ్డి ఓడిపోవడంతో మెగా అభిమానులకు అల్లు అర్జున్ ఒక్కసారిగా టార్గెట్ అయ్యారు. కిర్రాక్ ఆర్పీ వంటి ఆర్టిస్టులు నేరుగానే అల్లు అర్జున్ మీద విమర్శలు గుప్పిస్తున్నారు. ఈ విషయంలో అల్లు అర్జున్ అభిమానులు సైతం గట్టిగానే కౌంటరిస్తున్నారు. అసలు అల్లు అర్జున్ మెగా ఫ్యామిలీకి దూరం ఎప్పుడు పెరిగిందా అనే అనుమానం అందరిలోనూ కలుగుతోంది. అయితే తాజాగా అందుతున్న సమాచారం ప్రకారం ఓ నిర్మాతకు ఎమ్మెల్యే టికెట్ ఇవ్వాలని పవన్‌ను అల్లు అర్జున్ కోరడం.. దీన్ని పవన్ రిజెక్ట్ చేశారట. అప్పటి నుంచే వీరి మధ్య విభేదాలు తలెత్తినట్టు తెలుస్తోంది. నిర్మాత బన్నీ వాసు అల్లు ఫ్యామిలీకి అతి దగ్గరైన వ్యక్తి. బన్నీ వాసుకు టికెట్ ఇవ్వమని అల్లు అరవింద్, అల్లు అర్జున్ చాలా సార్లు పవన్ కళ్యాణ్‌ను రిక్వెస్ట్ చేశారట. అయితే పవన్ ఆయనకు టికెట్ ఇవ్వలేదు. గతంలో జనసేనకు మద్దతుగా నిలిచిన బన్నీ వాసు ఎన్నికల సమయంలో ఎక్కడ కనిపించలేదు. దీంతో బన్నీ వాసు కారణంగానే అల్లు , మెగా ఫ్యామిలీలో విభేదాలు వచ్చాయని అందరూ భావిస్తున్నారు. మరి ఇందులో ఎంత వరకు నిజం ఉందో తెలియాల్సి ఉంది.

# బోల్డ్ సీన్‌లో నటించబోతున్న ప్రభాస్?



పాన్ ఇండియా డార్లింగ్, యంగ్ రెబల్‌స్టార్ ప్రభాస్ ప్రస్తుతం కల్కి చిత్రం చేస్తున్నారు. ఈనెల 27వ తేదీన ఈ చిత్రం విడుదల కాబోతోంది. వైజయంతీ మూవీస్ పతాకంపై నాగ్ అశ్విన్ దర్శకత్వంలో సి.అశ్వనీదత్ దీన్ని నిర్మిస్తున్నారు. దాదాపు రూ.500 కోట్ల బడ్జెట్ అయినట్లు తెలుస్తోంది. ప్రపంచవ్యాప్తంగా భారీ కలెక్షన్లు కొల్లగొట్టాలనే లక్ష్యాన్ని నిర్దేశించుకున్నారు. అమితాబ్ బచ్చన్, కమల్ హాసన్, దీపికా పదుకొనే లాంటి భారీ తారాగణం ఈ చిత్రంలో పాలుపంచుకుంది. కల్కి తర్వాత సందీప్ రెడ్డి వంగా దర్శకత్వంలో స్పిరిట్ చేయబోతున్నారు ప్రభాస్. సందిగ్ధంలో ప్రభాస్ కల్కి విడుదలైన వెంటనే స్పిరిట్ షూటింగ్ లో పాల్గొనబోతున్నారు. కథ ప్రకారం ఈ సినిమాలో బెడ్‌రూమ్‌లో బోల్డ్ సన్నివేశం చేయాల్సి ఉంది. కథ ప్రకారం దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. ఈ విషయాన్ని సందీప్ రెడ్డి డార్లింగ్‌కు చెప్పారు. కచ్చితంగా ఈ సన్నివేశం చేయాల్సి ఉంటుందని చెప్పారు. అయితే చేయాలా? వద్దా? అనే సందిగ్ధతలో ప్రభాస్ ఉన్నారు. కథ ప్రకారం చూస్తే చేస్తారంటున్నారు. కథ ప్రకారం తప్పనిసరి స్పిరిట్ కు ముందు తీసిన యానిమల్ సినిమాలో కూడా కథ ప్రకారం బెడ్ రూమ్ సన్నివేశంలో రణబీర్ కపూర్ నటించారు. ఆ సన్నివేశం సినిమా విజయంలో కీలకపాత్ర పోషించింది. రూ.900కోట్లకు పైగా కలెక్షన్లు రాబట్టింది. స్పిరిట్ చిత్రంద్వారా రూ.2 వేల కోట్ల కలెక్షన్లు రాబట్టాలని సందీప్, ప్రభాస్ టార్గెట్ పెట్టుకున్నారు. ప్రభాస్ కు మహిళల ఫ్యాన్ ఫాలోయింగ్ ఎక్కువ. స్పిరిట్ లో బోల్డ్ సన్నివేశం చేస్తే వారు అంగీకరిస్తారా? లేదా? అనే సందిగ్ధంలో ప్రభాస్ కొట్టుమిట్టాడుతున్నట్లు తెలుస్తోంది. అయితే సందీప్ మాత్రం డార్లింగ్ పై ఒత్తిడి తెస్తున్నాడని తెలుస్తోంది. దాదాపుగా ఈ సినిమాలో ప్రభాస్ నటించే బోల్డ్ సీన్ ఉంటుందనే అంటున్నారు. అలా అయితే సరికొత్త ప్రభాస్ ను మనం చూస్తామని అర్థమవుతోంది. అంతర్జాతీయ స్థాయిలో కల్కి ఘనవిజయం సాధిస్తే స్పిరిట్ చిత్రాన్ని కూడా ప్రపంచంలోని పలు భాషల్లో విడుదల చేయాలని నిర్ణయించుకున్నారు.

# గుడివాడ, 10 వార్డులో వెనిగండ్ల విజయోత్సవ వేడుకలు



**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** సోమవారం స్థానిక 10వ వార్డు, ముబారక్ సెంటర్ సమీపంలో వెనిగండ్ల అభిమానులు కగ్గా దుర్గారావు, వంపుగడ్డ ఆనంద్ ల నేతృత్వంలో ఎమ్మెల్యే వెనిగండ్ల రాము విజయోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా తెలుగుదేశం నాయకులు కె. తులసీబాబు పాల్గొనగా, కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ కొడాలి నానిపై వెనిగండ్ల రాము భారీ మెజారిటీతో గెలవడం చరిత్రాత్మకమని, రాము ఆధ్వర్యంలో గుడివాడ పూర్తిస్థాయిలో అభివృద్ధి చెందుతుందని ఆకాంక్షించారు. అతిధులుగా పంచకర్ల మహేష్, కడియాల గణేష్ లు పార్టీ సీనియర్ నాయకులు షేక్ సర్కార్, షేక్ ఇబ్రహీం, గడ్డం ప్రకాష్‌దాస్ లతో పాటు స్థానికులు వెంకట నారయణ, కస్తూరి కిరణ్, రౌతు కేశవ్ మరియు చింతా సూరీ బాబు తదితరులు పాల్గొన్నారు.

# బండలాగుడు పోటీలను ప్రారంభించిన గిద్దలూరు ఎమ్మెల్యే ముత్తుముల

- శ్రీ అభయ ఆంజనేయ స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న గిద్దలూరు శాసనసభ్యులు అశోక్ రెడ్డి



**గిద్దలూరు, జూన్ 17 (వార్తాప్రభ) :** గిద్దలూరు మండలం, ముండ్లపాడు పంచాయతీ, బురుజుపల్లె గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయక అభయ ఆంజనేయ, షిరిడి సాయిబాబా స్వామి వార్ల ఆలయ 13 వ వార్షికోత్సవ వేడుకలలో గిద్దలూరు శాసనసభ్యులు ముత్తుముల అశోక్ రెడ్డి ముఖ్య అతిధిగా పాల్గోన్నారు. ఈ సందర్బంగా ఆలయ పూజారులు ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలను అందచేశారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేసిన బండలాగుడు పోటీలను అశోక్ రెడ్డి ప్రారంభించారు.. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, స్థానిక టీడీపీ నాయకులు, గ్రామ ప్రజలు పాల్గోన్నారు.

# ఇప్పీ తాజా ప్రచార కార్యక్రమం.. ఇప్పీ టాస్ ప్రారంభం




**రాజమండ్రి,జూన్ 17 (వార్తాప్రభ) :** సన్‌ఫీస్ట్ ఇప్పీ తమ ఇన్‌స్టాగ్రామ్‌లో తమ తాజా ప్రచారం 'ఇప్పీ టాస్' గురించి వెల్లడించిన నూతన ప్రచార కార్యక్రమం ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఐటిసి లిమిటెడ్ స్నాక్స్, నూడుల్స్ & పాస్తా, ఫుడ్ బిజినెస్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ కవితా చతుర్వేది మాట్లాడుతూ సన్‌ఫీస్ట్ ఇప్పీ సన్ ఫీస్ట్ నుండి ప్రముఖ ఇన్‌స్టంట్ నూడిల్ & పాస్తా బ్రాండ్, దేశంలో ఎక్కువ మంది ఇష్టపడే క్రికెటర్లు –రాహుల్ ద్రవిడ్, జస్ప్రీత్ బుమ్రా సూర్య కుమార్ యాదవ్‌ల తో తీర్చిదిద్దిన సరికొత్త ప్రచారంతో ఇది తిరిగి వచ్చిందన్నారు. ఈ వినోదభరితమైన ప్రచారం తో క్రికెట్ ఉత్సాహం తారాస్థాయి చేరుకుందన్నారు. జస్ప్రీత్ బుమ్రా & సూర్య కుమార్ యాదవ్ తమ ఇన్‌స్టాగ్రామ్ హ్యాండిల్స్‌లో 'ది టాస్' గురించి పంచుకున్న పోస్ట్‌ల వెనుక రహస్యం తెలుసుకోవాలనే ఆసక్తి తో ఇప్పటివరకు ఇంటర్నెట్ లో ఆసక్తి నెలకొంది అన్నారు. ఆటగాళ్ల పోస్ట్ ల వెనుక అర్ధం తెలియక సతమతమైన అభిమానుల ఆసక్తిని మరింత పెంచుతూ, ఇతరులు కూడా దీనిపై వైరల్ చేశారన్నారు. ఈ నూతన ప్రచారంలో రాహుల్ ద్రావిడ్ ప్రారంభించారన్నారు. ఐటీసి సన్ ఫీస్ట్ ఇప్పి నూతన టీవీసి అందరినీ ఆకట్టుకుంటుందని చెప్పారు.

# తక్షణమే లీకేజీలు బాగు చేసి తాగునీటి సౌకర్యం కల్పించాలి




**గుడివాడ,జూన్ 17 (వార్తాప్రభ) :** గుడివాడ మున్సిపాలిటీలో మంచినీళ్ల కొరత విపరీతంగా ఉంది, మంచినీళ్ల చెరువులు రెండు ఉన్నప్పటికీ ఒకటి గండిపడి నీళ్లన్నీ పోవడంతో ఒక చెరువు మాత్రమే ఉంది. దాని నిండా నీళ్లు నిలువ ఉంచకుండా ప్రభుత్వాధికారులు నిర్లక్ష్యం ద్వారా నీటి ఎద్దడి గుడివాడ ప్రజలు పడుతున్నారు, 10అడుగుల లోతుల దాకా ఉండే నీటి నిల్వను గండి పడటం ద్వారా ఆరుఅడుగుల లోతు వరకే నీళ్లు నిలువ ఉండి ప్రభుత్వ అధికారులు నిర్లక్ష్యం ద్వారా గుడివాడ ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు, మంచినీరు శుభ్రపరిచి ఏరియాలో లీకేజీలు ఏర్పడిన చోట వెంటనే బాగు చేసి మురికి నీరు కలవకుండా మంచినీళ్ల సదుపాయాన్ని ప్రజలందరికీ అందించాల్సిందిగా గుడివాడ సిపిఎం పార్టీ మండల కార్యదర్శి ఆర్ సి పి రెడ్డి డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఐద్వా కార్యదర్శి పి రజిని పాల్గొన్నారు.



ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి నాలుగోసారి ముఖ్యమంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన నారా చంద్రబాబు నాయుడు ని తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో కలిసి అభినందన తెలుపుతున్న గన్నవరం నియోజకవర్గ బీసీ సెల్ నాయకులు కందుల లీలా కృష్ణ యాదవ్

–విజయవాడ,జూన్ 17 (వార్తాప్రభ) :

Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188